సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
హైదరాబాద్
సోమవారం, 16.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13
సంచిక: 116
పేజీలు: 12
వెల: రూ. 5




# బండి vs దుద్దిళ్ల-పొన్నం

## కరీంనగర్ కార్పొరేషన్‌లో కురుక్షేత్రం

- కార్పొరేషన్ చేజిక్కించుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ ఫైట్
- కాంగ్రెస్ కు మద్దతుగా బీఆర్ఎస్
- కరీంనగర్ కంచుకోటపై 'బండి' ముద్ర పడేనా?
- కాంగ్రెస్ మంత్రుల వ్యూహం ఫలించేనా?
- క్షణక్షణం ఉత్కంఠగా రాజకీయాలు

02



ముద్ర, కరీంనగర్ :

కరీంనగర్ కంచుకోటపై కాషాయ జెండా ఎగురవేయాలని బండి సంజయ్ 'చక్రం' తిప్పుతున్నారు.. మరోవైపు బీఆర్ఎస్, ఎంఐఎంను తోడు చేసుకుని కమల దళానికి 'హస్తం' షాక్ ఇచ్చేందుకు మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు రెడీ అయ్యారు. ఈ రెండు పార్టీల వ్యూహాలతో నగర రాజకీయాలు క్లైమాక్స్ చేరిన పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తున్నాయి. సంఖ్యాబలం బీజేపీ వైపు ఉన్నా.. అధికార బలం, ప్రత్యర్థుల ఐక్యత కాంగ్రెస్‌కు అండగా నిలుస్తోంది. మేయర్ పీఠానికి అవసరమైన మేజిక్ ఫిగర్ కోసం బండి సంజయ్ వర్సెస్ మంత్రుల ద్వయం మధ్య సాగుతున్న ఈ మైండ్ గేమ్ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

# ఓం నమఃశివాయ



## మార్మోగిన శివనామస్మరణ

- మహాశివరాత్రి వేళ భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- వేములవాడ, కాళేశ్వరం, ఏడుపాయలలో భక్త జన సంద్రం
- పట్టువస్త్రాలతో ప్రభుత్వ ప్రతినిధుల ప్రత్యేక పూజలు
- రాత్రంతా జాగరణలు.. శివయ్య కటాక్షం కోసం భక్తుల తపస్స

09



## పాకిస్తాన్ పై 'ఇషాన్'

# విధ్వంసం

### యువరాజ్ రికార్డు బ్రేక్

- అభిషేక్ ఔట్ షాక్ తర్వాత ఇషాన్ సునామీ..
- కిషన్ హాఫ్ సెంచరీతో మ్యాచ్ మలుపు
- పాక్ బౌలర్లకు నిద్ర లేకుండా చేసిన విధ్వంసం
- చివర్లో సూర్య, దూబే ఫినిషింగ్ టచ్
- టీమిండియా 175-7 భారీ స్కోరు



## గులాబీ తోటలో

# జాగృతి ముళ్లు

### కవిత మద్దతు అభ్యర్థుల కారణంగా బీఆర్ఎస్ ఓట్ల చీలిక

- బీఆర్ఎస్‌కు అతిపెద్ద ముప్పుగా కవిత
- సింహం గుర్తుతో పోటీ చేసిన వర్గం బీఆర్ఎస్‌కు గట్టి షాక్ ఇచ్చింది
- లక్షకు చేరువైన ఓట్లు చీలడంతో గెలుపోటముల సమీకరణాలు మారాయి
- పార్టీ లేకుండానే కవిత ప్రభావం క్షేత్రస్థాయిలో కనిపించింది
- త్రిముఖ పోటీలో ప్రతి శాతం ఓటు కీలకంగా మారింది
- కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చినా ఓట్ల శాతం పరంగా గట్టి పోటీ కనిపించింది
- బీజేపీ, స్వతంత్రుల ఓట్లు కూడా ఫలితాలపై ప్రభావం చూపాయి
- పార్టీ పెడితే.. గెలుపు అంశం కాదు.. చీలికతోనే ప్రమాదం
- బీసీ అస్త్రంతో కవిత రాజకీయ వ్యూహం కొత్త మలుపు తిరిగింది
- రానున్న ఎన్నికల్లో చతుర్ముఖ పోరు తప్పదనే సంకేతాలు

02



| పార్టీ | ఓట్లు | శాతం | అభ్యర్థులు |
|---|---|---|---|
| కాంగ్రెస్ | 15,04,669 | 39.80% | 2,936 |
| బీఆర్ఎస్ | 10,87,009 | 28.75% | 2,876 |
| బీజేపీ | 5,92,753 | 15.68% | 2,634 |
| స్వతంత్రులు | 3,14,096 | 8.31% | 2,787 |
| మజ్లిస్ | 1,24,236 | 3.29% | 283 |
| ఫార్వర్డ్ బ్లాక్ | 57,129 | 1.51% | 288 |
| సీపీఐ | 49,450 | 1.31% | 168 |
| సీపీఎం | 22,048 | 0.58% | 128 |
| జనసేన | 13,504 | 0.36% | 333 |
| బీఎస్పీ | 7,715 | 0.20% | 213 |
| టీఆర్ఏపీ | 3,379 | 0.09% | 91 |
| ఆప్ | 1,717 | 0.05% | 38 |
| ఇతరులు | 2,668 | 0.07% | 154 |

## వాళ్లను పక్కన బెడితే సహించం

### పార్టీ కోసం పని చేసే వాళ్లను గుర్తించాల్సిందే



- కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళతా
- పార్టీ నిర్ణయాల్లో నా సూచనలు పరిగణలోకి తీసుకోవాలి
- ఏఐసీసీ కార్యదర్శి సవాంత్ తో మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- జగిత్యాల ఎమ్మెల్యే, జీవన్ రెడ్డిల మధ్య సయోధ్య

03

## కాంగ్రెస్, సీపీఐ పొత్తుతో ఎవరికి మేలు?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



- కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి
- సింగరేణి ప్రయోజనాల కోసమే సీపీఐతో జత
- బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను కాంగ్రెస్ నేతలు ప్రలోభపెడుతున్నారు

03

## టార్గెట్ సీఎం

### కాంగ్రెస్‌లో కొత్త గందరగోళానికి రాజగోపాల్ రెడ్డి బాణం

- రేవంత్ ఒక్కడే మొనగాడా? అంటూ మునుగోడు ఎమ్మెల్యే సంచలన ప్రశ్నలు
- "పదేళ్లు నేనే సీఎం" వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం
- అధిష్టానాన్ని అవమానించారంటూ ఫైర్
- ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు చూపిస్తూ రేవంత్ నాయకత్వంపై సందేహాలు
- ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలపై పీసీసీ కాలాన్ని గుర్తుచేసిన రాజగోపాల్ రెడ్డి
- వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలే
- కాంగ్రెస్‌లో అంతర్గత యుద్ధం

10



## తండాలు, గూడేలకు మహార్దశ

### సంత్ శ్రీ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

- రోడ్లు, పాఠశాలలు, పంచాయతీ భవనం, తాగునీరు, కరెంట్ ఇస్తాం
- ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు, పాఠశాల, పంచాయతీ భవనం తప్పనిసరి
- గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్‌కు ప్రాధాన్యత ఇస్తామన్న రేవంత్
- అటవీ ప్రాంతాల్లో సోలార్ పంపుసెట్లతో విద్యుత్ సమస్య పరిష్కారం
- నల్లమలలో సేవాలాల్ మహరాజ్ పుణ్యక్షేత్ర నిర్మాణానికి నిర్ణయం
- గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా ప్రపంచ స్థాయి క్షేత్రం నిర్మాణం

లంబాడా సమాజానికి గౌరవం, అభివృద్ధి అందించడం బాధ్యత
గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళిక

03



## ఇందూరులో కాషాయం హ్యాండ్సప్

### నిజామాబాద్‌లో వెనక్కి తగ్గిన బీజేపీ.. కాంగ్రెస్—ఎంఐఎం అవగాహన




- సోమవారం ఎన్నికలతో కార్పొరేషన్లలో రాజకీయ ఉత్కంఠ పరాకాష్టకు
- కరీంనగర్ లో పోటాపోటీ

02

## ఆయుధాలు విడిచి జనంలోకి రండి

### మావోయిస్టులకు డీజీపీ బీ శివధర్ రెడ్డి పిలుపు




- లొంగిపోయిన వారికి పునరావాసం, గౌరవప్రద జీవితం హామీ
- రెండేళ్లలో 588 మంది మావోయిస్టులు సాధారణ జీవితంలోకి
- శాంతియుత మార్గాల ద్వారానే సమస్యలకు పరిష్కారం
- మిగిలిన కేడర్ కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచన

03

# సక్సెస్ టాస్క్

### ఫలించిన రేవంత్ వ్యూహాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక ప్రాంతాల్లో గెలిచి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ముందు కాంగ్రెస్ పార్టీ ఒక ప్రత్యేక ప్రణాళికతో ఎన్నికలలోకి రంగంలోకి దిగింది. కాంగ్రెస్ వ్యూహంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర ఏంటి?.. అసలు ఇప్పుడు రేవంత్ కు వచ్చిన వ్యూహం ఏమిటి..? ఏఐసీసీ దగ్గర ఏం జరిగింది.. నిన్నటిదాకా అటూ ఇటూ ఇన్న మంత్రులు మళ్లీ దారిలోకి వచ్చినట్టేనా అనేది ఇప్పుడు రాజకీయ చర్చ. రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక ప్రాంతాల్లో గెలిచి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ముందు కాంగ్రెస్ పార్టీ ఒక ప్రత్యేక ప్రణాళికతో ఎన్నికలలోకి రంగంలోకి దిగింది. అంతకుముందు జరిగిన అసెంబ్లీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ పక్కా మిగతా 02లో



## ఇదీ ఏఐ ముద్ర

మహాశివరాత్రి పర్వదినం రోజు శివాలయాల్లో భక్తులు పూజలు చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు.



**టాప్ 10 భారత్-పాక్ మ్యాచ్ లు**

**1992 వరల్డ్ కప్ (సిడ్నీ)**

సచిన్ టెండూల్కర్ అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్ పాక్‌పై మొదటి వరల్డ్ కప్ విజయం సాధించింది. ఇదే రైవల్రీకి బలమైన ఆరంభం.



# బండి vs దుద్దిళ్ల-పొన్నం

- కరీంనగర్ కార్పొరేషన్‌లో 'కురుక్షేత్రం'
- కార్పొరేషన్ చేజిక్కించుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ ఫైట్



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ పీఠం దక్కించుకోవడం ఇప్పుడు కేవలం ఒక పదవి కోసమే కాదు, పార్టీల ప్రతిష్ఠకు సంబంధించిన అంశంగా మారింది. 66 డివిజన్లు ఉన్న ఈ కార్పొరేషన్‌లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'హంగ్' ఏర్పడింది. అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ, ఎలాగైనా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూస్తుంటే, అనూహ్యంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేందుకు బీఆర్ఎస్ సిద్ధపడటం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది.

### నంబర్ గేమ్: ఎవరి బలం ఎంత?

మేయర్ పీఠం దక్కించుకోవడానికి కావాల్సిన మేజిక్ ఫిగర్ 34 (సగం కంటే ఒకటి ఎక్కువ). ప్రస్తుత బలాబలాలు ఇలా ఉన్నాయి.

**బీజేపీ (30 సీట్లు):** నలుగురు స్వతంత్రులు ఇప్పటికే కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. దీంతో బీజేపీ బలం 34కి చేరింది. బండి సంజయ్ ఎక్స్–అఫీషియో ఓటుతో కలిపి ఈ సంఖ్య 35 అవుతుంది.

**విపక్ష కూటమి (కాంగ్రెస్ 14 + బీఆర్ఎస్ 9 + ఎంఐఎం 3):** ఈ మూడు పార్టీల బలం కలిపితే 26 అవుతుంది. మరో ఎనిమిది మంది స్వతంత్రులను తమ వైపు తిప్పుకుంటే బీజేపీని ఓడించవచ్చని మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు వ్యూహరచన చేస్తున్నారు.

### బీఆర్ఎస్ అనూహ్య మలుపు - గంగుల కీలక వ్యాఖ్యలు

దశాబ్ద కాలంగా కరీంనగర్ రాజకీయాల్లో చక్రం తిప్పిన బీఆర్ఎస్, ఇప్పుడు చిరకాల ప్రత్యర్థి అయిన కాంగ్రెస్‌తో చేతులు కలపడం చర్చనీయాంశమైంది. మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, "నగర అభివృద్ధి కోసం, మతతత్వ శక్తులను అడ్డుకోవడానికే మేము కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నాం" అని స్పష్టం చేశారు.

### ఉత్కంఠ రేపుతున్న ఎక్స్-అఫీషియో ఓట్లు

ఎమ్మెల్సీ మల్క కొమురయ్య ఎక్స్–అఫీషియో ఓటు నమోదు చేసుకున్నప్పటికీ, ఆయన స్థానిక ఓటరు కాకపోవడంతో సాంకేతిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇదే జరిగితే బీజేపీకి ఒక ఓటు తగ్గే అవకాశం ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకునే కాంగ్రెస్ తన మేయర్ అభ్యర్థిగా ఒక స్వతంత్ర అభ్యర్థిని (కొమురయ్య) నిలబెట్టి, విప్ జారీ కాకుండా 'క్రాస్ ఓటింగ్' జరిగేలా ప్లాన్ చేస్తోంది.

### బండి సంజయ్ రివర్స్ స్కెచ్

"ప్రజలు బీజేపీకి స్పష్టమైన తీర్పు ఇచ్చారు. అనైతిక పొత్తులతో గెలవాలని చూస్తే జనం క్షమించరు" అని బండి సంజయ్ హెచ్చరిస్తున్నారు. తన కార్పొరేటర్లు చేజారిపోకుండా ఇప్పటికే వారిని రహస్య ప్రాంతాలకు (క్యాంపులకు) తరలించినట్లు సమాచారం.

### నేటి షెడ్యూల్:

ఉదయం 11:00: కొత్త కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం.
మధ్యాహ్నం 12:30: మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం.
బీజేపీకి బలం ఉన్నప్పటికీ, అధికార యంత్రాంగం, విపక్షాల ఐక్యత బండి సంజయ్‌కు సవాల్‌గా మారాయి. సోమవారం మధ్యాహ్నం వరకు ఈ సస్పెన్స్ కొనసాగేలా కనిపిస్తోంది.

# గులాబీ తోటలో 'జాగృతి' ముల్లు

(మొదటి పేజీ తరువాయి)

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** స్థానిక ఎన్నికల్లో ఒక్క ఓటు అయినా కీలకమే. ఎందుకంటే అదే గెలుపోటములను ప్రభావితం చేస్తోంది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఏడు మున్సిపల్ కార్పొరేషన్, 116 మున్సిపాలిటీలలోని 2,981 వార్డులకు జరిగిన ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లు, 66 మున్సిపాలిటీ గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీ గెలిచి సత్తాచాటింది. కానీ పోల్ అయి, చెల్లుబాటైన ఓట్లలో కేవలం 39.8 శాతం ప్రజల ఓట్లు మాత్రమే దక్కించుకోగలిగింది. మొత్తం 2,936 మందిని పోటీకి దింపిన హస్తం పార్టీ 15,04,669 ఓట్లు దక్కించుకుంది. 2,876 మంది అభ్యర్థులు పోటీ చేసిన బీఆర్ఎస్ కు 28.75 శాతం ప్రజలు జైకొట్టారు. ఈ లెక్కన 10,87,009 మంది గులాబీ పార్టీ వైపు మొగ్గు చూపారు. ఈ రెండు పార్టీలు సాధించిన వార్డులు, మున్సిపాలిటీలలో భారీ వ్యత్యాసం ఉన్నప్పటికీ, ఓట్ల మధ్య తేడా కేవలం 4,17,660 మాత్రమే కావడం గమనార్హం. ఇక 2,634 మందిని బరిలోకి దింపిన కాషాయ దళం 15.68 శాతం ఓట్లను మాత్రమే సాధించగలిగింది. 5,92,753 మంది బీజేపీకి ఓటు వేశారు. చాలా మంది గెలుపోటములు ప్రభావితం చేసిన స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 2,787 మంది పోటీ చేయగా, 8.31 శాతంతో 3,14,096 ఓట్లు సాధించారు. కేవలం 283 వార్డుల్లోనే పోటీ చేసిన ఏఐఎంఐఎం (మజ్లిస్ పార్టీ) 3.29 శాతంతో 1,24,236 ఓట్లు పొందింది. ఇదంతా ఓకే.. కానీ, చాలా చోట్ల పదుల సంఖ్యలో గులాబీ పార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. ఓడిపోయిన వారందరికీ ఒకే కారణం చూపించలేక పోయినా.. అందులో కేసీఆర్ కూతురు, కేటీఆర్ సోదరి కవిత ప్రభావం మాత్రం ఎంతో కొంత కనిపిస్తోంది.

### గెలుపు కాదు.. విజయాలు తారుమారు

ప్రధానంగా ఫార్వర్డ్ బ్లాక్ సింహం గుర్తుపై కవిత మద్దతుదారులు పోటీ చేశారు. ప్రస్తుత లెక్కల ప్రకారం ఫార్వర్డ్ బ్లాక్ కు వచ్చిన ఓట్లు 57 వేలు. ఇందులో మెజార్టీ కవితదే అన్నట్టు స్పష్టమవుతోంది. అంతేకాకుండా కొన్నిచోట్ల ఇండిపెండెంట్లకు కూడా కవిత మద్దతు ఇచ్చింది. అవి 1 శాతంగా కనిపిస్తున్నాయి. ఇలా దాదాపుగా లక్ష ఓట్లను ఎలాంటి గుర్తు.. సొంత పార్టీ లేకుండానే కవిత చీల్చి వేశారు. అంటే.. రాజకీయ రణరంగంలోకి దిగి.. పార్టీ గుర్తుపై పోటీకి సిద్ధమైతే.. ప్రధాన పార్టల గెలుపోటములను తారుమారు చేసే ఓట్లను కవిత చీల్చుతుందనడంలో సందేహం కనిపించడం లేదు.

1537 వార్డుల్లో జయపతాకం ఎగురవేసిన హస్తం పార్టీ

రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల వారీగా తుది ఫలితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మొత్తం 2996 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయగా, ఒక స్థానంలో అభ్యర్థి మరణించడంతో ఎన్నిక వాయిదా పడింది. 14 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన వార్డులతో కలిపి మొత్తం 2995 వార్డుల ఫలితాలు వెల్లడైనట్లు ఎస్ఈసీ అధికారికంగా ప్రకటించింది. ఇందులో కాంగ్రెస్ కు 1537 వార్డులు, బీఆర్ఎస్ 781, బీజేపీ 336, ఎంఐఎం 70, సీపీఎం 13, బీఎస్పీ



రెండు స్థానాలు దక్కాయి. టీడీపీ, వైసీపీ, ఆప్ లకు ఒక్క స్థానం కూడా దక్కలేదు. రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన ఇతర పార్టీలు 73, స్వతంత్రులు 183 స్థానాల్లో గెలిచారు. పార్టీల వారీగా ఈ ఫలితాలను ఎస్ఈసీ వెబ్ సైట్ లో పొందుపర్చింది.

### కవిత రూపంలో గులాబీకి ముళ్లు..?

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు అనూహ్య మలుపులు తిరుగుతోంది. దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని ఏలిన భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం పూర్వవైభవం పోరాడుతున్న తరుణంలో, ఆ పార్టీ ఇంటి పోరే పెద్ద శాపంగా మారేలా కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా పార్టీ పెట్టే దిశగా అడుగులు వేయడం గులాబీ బాటలో ముళ్ల కంచెగా మారుతోంది. పైకి బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మవిశ్వాసం ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో కవిత చీల్చే ప్రతి ఓటు పార్టీ పునాదులను కదిలిస్తుందని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.

### సింహం గుర్తు ఎఫెక్ట్.. ఓట్ల చీలికతో ముప్పు

మున్సిపల్ ఎన్నికల్లో కవిత ప్రత్యక్షంగా పార్టీ పెట్టకపోయినా, తన మద్దతుదారుల ద్వారా సింహం గుర్తుకు మద్దతు ఇచ్చి కొన్ని చోట్ల గట్టి ప్రభావమే చూపారు. ఈ పరిణామం బీఆర్ఎస్ పెద్దల కళ్లు బైర్లు కమ్మేలా చేసింది. కవిత పార్టీ పెట్టడం వల్ల ఆమె అధికారంలోకి వస్తారా లేదా అన్నది పక్కన పెడితే, ఆమె చీల్చే నాలుగు నుంచి ఐదు శాతం ఓట్లు బీఆర్ఎస్ గెలుపోటములను తలకిందులు చేయడం ఖాయం. ఉమ్మడి సిద్ధాంతాలు, ఒకే రకమైన ఓటు బ్యాంకు ఉండటంతో కవిత వైపు వెళ్లే ప్రతి ఓటు నేరుగా బీఆర్ఎస్ ఖాతా నుంచే మైనస్ అవుతుంది. ఇది త్రిముఖ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల కొంప ముంచేలా ఉంది.

### పెరిగిన అంతరం

కవిత తన రాజకీయ ప్రస్థానాన్ని కేవలం విమర్శలకే పరిమితం చేయకుండా, బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను గాలికి వదిలేశారంటూ ఆమె సంధిస్తున్న విమర్శలు పార్టీ కార్యకర్తల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. తండ్రి కేసీఆర్ పట్ల గౌరవం చూపిస్తూనే, పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకత్వంపై ఆమె చేస్తున్న దాడి ద్వారా అసంతృప్త నేతలను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది రానున్న రోజుల్లో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణాన్ని దెబ్బతీసే ప్రమాదం కనిపిస్తోంది.

### బీసీ అస్త్రం.. రాజకీయ సామాజికం

ప్రస్తుతం కవిత తన రాజకీయ ఎజెండాలో బీసీ సామాజిక వర్గాన్ని ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, వారికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆమె చేస్తున్న ఆరోపణలు పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకుపై దెబ్బకొట్టేలా ఉన్నాయి. మరో మూడు నెలల్లో కొత్త పార్టీ పేరు , జెండాను ప్రకటిస్తానని ఆమె స్పష్టం చేయడం, రాజకీయ వ్యూహకర్తల సహకారం తీసుకుంటున్నారనే వార్తలు బీఆర్ఎస్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఉద్యమ కాలం నుంచి తనతో నడిచిన తెలంగాణ జాగృతి కేడర్ ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా మారితే, అది బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ అవుతుంది.

### గులాబీ కేడర్ కు అంతర్గత భయం

ఏదైనా కవిత రూపంలో వచ్చే ప్రమాదం గులాబీ నేతలను అంతర్గతంగా భయపెడుతూనే ఉంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, కవిత వేస్తున్న అడుగులను గమనిస్తుంటే, రానున్న రోజుల్లో తెలంగాణలో చతుర్ముఖ పోరు తప్పదనిపిస్తోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్ బలాన్ని పెంచుకుంటుంటే, మరోవైపు బీజేపీ తన ఉనికిని చాటుకుంటోంది. ఈ పరిస్థితుల్లో కవిత రూపంలో ఎదురవుతున్న ఈ సొంత ముప్పును బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆమె చేసే విమర్శలు ఆమెకు సానుభూతిని కూడ గట్టడమే కాకుండా, తనకంటూ ఒక స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని సృష్టిస్తున్నాయి. ఈ రాజకీయ యుద్ధంలో కవిత గెలుస్తారో లేదో కానీ, బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ఆమె ప్రధాన కారకురాలిగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఇందూరులో కాషాయం హ్యాండ్సప్

**నిజామాబాద్‌లో వెనక్కి తగ్గిన బీజేపీ..**
**కాంగ్రెస్-ఎంఐఎం అవగాహన**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తామే దక్కించుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. మేయర్ పీఠం తమదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు.కరీంనగర్ మేయర్ పీఠం కోసం కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. కరీంనగర్ మేయం పదవిని కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా దక్కించుకుంటుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. వేములవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన, కరీంనగర్ మేయర్ ఎన్నికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్‌లో పూర్తి మెజార్టీ లేకనే బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ మేయర్ పోటీ నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారని గుర్తుచేశారు. మరి కరీంనగర్‌లో మెజార్టీ లేకపోయినా బీజేపీ మేయర్ పీఠం దక్కించుకుంటుందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎలా చెబుతారని ఆయన ప్రశ్నించారు. కార్పొరేషన్లలో ప్రజాస్వామ్యబద్ధంగా మేయర్ ఎన్నిక జరుగుతుందని, అందరినీ కలుపుకొని పీఠాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిజెపి ఎలాంటి ఎత్తుగడలు వేస్తుందో, తాము కూడా అదే స్థాయిలో ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మేయర్, ఛైర్‌పర్సన్ ఎన్నికల సమయంలో సహజంగానే క్యాంపు రాజకీయాలు ఉంటాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున నగరాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పొన్నం హామీ ఇచ్చారు.

### నిజామాబాద్ ను వదిలేశారు..

నిజామాబాద్ కార్పొరేషన్ లో మేయర్ పీఠం దగ్గరదాకా వెళ్లిన బీజేపీ.. అనూహ్యంగా చేతులెత్తేసింది. అటు ఎంఐఎం మీద ఆధార పడాల్సిన పరిస్తితి.. ఇటు కాంగ్రెస్ నుంచి ఎవరూ వచ్చే పరిస్థితి లేకపోవడంతో బీజేపీ ఆశలు వదిలేసుకుంది. చివరకు కాంగ్రెస్, ఎంఐఎం మధ్య అవగాహనతో ఇక, ఇందూరు హస్తానికి చిక్కినట్టు.

### కరీంనగర్ కార్పొరేషన్‌లో మ్యాజిక్ ఫిగర్ దాటిన బీజేపీ !

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ



(BJP) అత్యధిక స్థానాలు గెలుచుకుంది. అయితే పూర్తి మెజార్టీ రాకపోవడంతో ఇండిపెండెంట్ అభ్యర్థులను బీజేపీ వైపు తిప్పుకోవడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సక్సెస్ అయ్యారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 30 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ (34) కోసం స్వతంత్ర అభ్యర్థుల మద్దతు కీలకంగా మారింది.

### బీజేపీకి మద్దతు తెలిపిన నలుగురు ఇండిపెండెంట్లు..

కరీంనగర్ లో గెలిచిన నలుగురు స్వతంత్ర కార్పొరేటర్లు కమలం గూటికి చేరడంతో బీజేపీ బలం 34కు పెరిగింది. ఒక కార్యక్రమంలో కేంద్రమంత్రి బండి సంజయ్ స్వయంగా వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇప్పటికే ఇద్దరు స్వతంత్రులు బీజేపీలో చేరగా, తాజాగా మరో ఇద్దరు (వి. కవిత, ఎం. గణేష్) పార్టీలో చేరారు. దీంతో మేయర్ పీఠం దక్కించుకునేందుకు కావాల్సిన సంఖ్యాబలం బీజేపీకి లభించింది. దాంతో కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదేనని తేలిపోయింది. సోమవారం జరిగే మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్,

# సక్సెస్ టాస్క్

**ఫలించిన రేవంత్ రెడ్డి వ్యూహాలు**

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికలతో వ్యవహరించి అఖండ విజయాన్ని అందుకుంది. తన వ్యూహాలతో ప్రత్యర్థులకు దొరక్కుండా మాస్టర్ ప్లాన్‌ను ఎగ్జిక్యూట్ చేసింది. ఈ వ్యూహాల వెనుక మాత్రం సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. ఆయన ముందు చూపుతో మంత్రులకు పక్కాగా బాధ్యతలు అప్పగించి గెలుపే పనితీరుకు ప్రామాణికమని ఆయన స్పష్టంగా చెప్పారు. అందరూ కలిసికట్టుగా పని చేస్తే విజయం తమదే అని చెప్పిమరీ, అత్యధిక వార్డులు, డివిజన్లను సొంతం చేసుకుంది.

### మహిళల ఓటర్లే కాంగ్రెస్‌కు ఆయుధం?:

ఎక్కడైనా ఓట్ల పడాలంటే ప్రజలకు సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేయాలి. కేవలం ప్రకటించడం మాత్రమే కాకుండా వాటిని పక్కాగా అమలు చేయాలి. ఆ అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలి. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే చేసింది. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో పేదలు, ముఖ్యంగా మహిళల్లో పార్టీపై అభిమానం పెరిగేటట్లు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వంటగ్యాస్ రూ.500లకే, రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ, నెలకు రూ.200ల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో విస్తృతంగా జనాల్లోకి వెళ్లారు. దీంతో మహిళల్లో పార్టీపై మంచి పేరును సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆ మహిళా ఓటర్లే కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టారు.

### గాంధీభవన్ నుంచి ఫోన్ కాల్స్:

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయో లేదో అని గాంధీభవన్‌లో వార్ రూం నుంచి ఫోన్ చేసి అడిగేవారు. అలా చేయడంతో చాలా మంది ఫోన్‌లో కాంగ్రెస్ పార్టీకే తమ ఓటు అని చెప్పినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అన్నింటా నెగ్గడమే ధ్యేయంగా ముందుగా లోక్‌సభ నియోజకవర్గానికొక మంత్రిని ఇన్‌ఛార్జిగా నియమించి పీసీసీ స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది.

### ఇన్‌ఛార్జీల నియామకంతో గెలుపు

ఆశావహుల నుంచి పేర్లను సేకరించి, వాటిని సమగ్రంగా వడపోసి బలమైన అభ్యర్థులను ఎంపిక చేసే పూర్తి బాధ్యతను కమిటీలకే అప్ప



గించారు. ఎవరి ఒత్తిళ్లకూ లొంగి పార్టీకి నష్టం కలిగించవద్దని సీఎం స్పష్టం చేయడంతో నేతలు అప్రమత్తమయ్యారు. క్షేత్రస్థాయిలో పాత, కొత్త తరం నాయకుల మధ్య ఉన్న విభేదాలను ముందుగానే గుర్తించి, పరిశీలకులు మరియు కమిటీ సభ్యులను పంపి వాటిని పరిష్కరించారు. ప్రతి మున్సిపాలిటీకి ఇతర ప్రాంతానికి చెందిన నేతను పరిశీలకుడిగా నియమించి, స్థానిక పరిస్థితులపై ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు నిష్పాక్షిక నివేదికలు అందేలా చర్యలు తీసుకున్నారు. లోపాల సవరణలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఇన్‌ఛార్జి మంత్రులను అప్రమత్తం చేశారు. అంతర్గత సమావేశాల్లో ప్రతి ప్రాంతంలో కాంగ్రెస్ బలాబలాలను అంకెలతో సహా సీఎం రేవంత్ రెడ్డి వివరించి, వెనుకబడి ఉన్నచోట గట్టి చర్యలు తీసుకోవాలని బాధ్యులైన నేతలను హెచ్చరించారు.

కొన్ని మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు కఠిన పోటీ ఉందని సర్వేలో తేలడంతో స్థానిక నేతలు, స్క్రీనింగ్ కమిటీని ముందస్తుగా అప్రమత్తం చేసి ప్రచార వ్యూహాలను మెరుగుపరచడం ద్వారా అక్కడ విజయం సాధించినట్లు పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే రెబెల్స్‌గా బరిలో నిలవడం వల్ల కొన్ని చోట్ల ప్రతిపక్షాలకు లాభం కలిగిన నేపథ్యంలో, అదే పరిస్థితి మున్సిపల్ ఎన్నికల్లో పునరావృతం కాకుండా పార్టీ జాగ్రత్తలు తీసుకుంది. జగిత్యాల మినహా ఎక్కువ ప్రాంతాల్లో తిరుగుబాటు అభ్యర్థులు బరిలో నిలవకుండా సీఎం, పీసీసీ, ఏఐసీసీ తీసుకున్న చర్యలు ఫలించాయి. అయితే జగిత్యాలలో సీనియర్ నేత జీవన్ రెడ్డి రెబెల్స్‌ను ప్రోత్సహించడం వల్ల కాంగ్రెస్ బీ ఫాం మీద పోటీ చేసిన తొమ్మిది మంది అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఈ అంశాన్ని పార్టీ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు పీసీసీ వర్గాలు వెల్లడించాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
16.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10**
**భారత్-పాక్ మ్యాచ్**

1996 వరల్డ్ కప్ (బెంగళూరు క్వార్టర్ ఫైనల్)
నవజ్యోత్ సిద్ధూ, అజయ్ జడేజా ఫినిషింగ్‌తో భారత్ భారీ స్కోర్ చేసింది. వసీం అక్రమ్ లేకపోవడంతో పాక్ మ్యాచ్ కోల్పోయింది.



# నల్లమల్లలో సేవాలాల్ మహరాజ్‌కు పుణ్యక్షేత్రం

- **గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్మాణం**
- **తండాలు, గూడేలకు మహర్ధశ తెస్తాం**
- **రోడ్లు, పాఠశాలలు, పంచాయతీ భవనం, తాగునీరు, కరెంట్ ఇస్తాం**
- **సంత్ శ్రీ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**





తెలంగాణలో ఉన్న అన్ని తండాలు, గూడాలకు మహర్దశ చేకూర్చుతామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వాటికి తప్పనిసరిగా బీటీ రోడ్డు ఉండేలా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. కనెక్టివిటీ కోసం బీటీ రోడ్డుతో పాటు ప్రతి గ్రామ పంచాయతీలో పాఠశాల, పంచాయతీ భవనం ఉండాలని చెప్పారు. తాగడానికి మంచినీరు, కరెంట్ అందించాలన్న సీఎం.. అటవీ ప్రాంతాల్లో ఉండే సమస్యలను దృష్టిలో ఉంచుకుని కరెంట్ లేని చోట సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేస్తూ గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆదివారం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బంజారా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నల్లమల అటవీ ప్రాంతంలో బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ పుణ్యక్షేత్రాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది సేవాలాల్ జయంతి ఉత్సవాలను అక్కడే నిర్వహించుకునేలా, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అత్యద్భుతంగా పుణ్యక్షేత్రాన్ని నిర్మిస్తామని అన్నారు. ఆదివాసీలకు ఆదిలాబాద్‌లో నాగోబా దేవాలయం, మేడారంలో సమ్మక్క సారలమ్మ పుణ్యక్షేత్రం ఉన్నట్టుగా బంజారాలకు ప్రత్యేక క్షేత్రం లేదని పేర్కొన్నారు. అందుకోసం నల్లమల అటవీ ప్రాంతంలో 20 ఎకరాల భూమిని ఇప్పటికే కేటాయించినందున, అక్కడ బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ప్రపంచంలోనే బ్రహ్మాండమైన పుణ్యక్షేత్రంగా, గొప్ప పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మానవజాతి శాంతి మార్గంలో, చెడును విడిచి, భక్తితో సన్మార్గంలో నడవాలని బోధించిన సంత్ సేవాలాల్ దేశంలో 15 కోట్ల మంది గిరిజనులకు ఆదర్శప్రాయంగా నిలిచారని సీఎం కొనియాడారు. అలాంటి మహనీయుని జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, పునర్నిర్మాణంలో లంబాడా సోదరుల పాత్ర ఎవరూ మరువలేనిదని వెల్లడించారు. వారికి సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వంలో సముచిత స్థానం, గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. 2006 నుంచి ఇప్పటివరకు ప్రతి సందర్భంలోనూ లంబాడా సోదరులు తనకు అండగా నిలిచారని చెప్పారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందన్న సీఎం... నిరుపేదలకు పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవని చెప్పారు. నిరక్షరాస్యత కారణంగా చాలా మంది పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే నిరుపేదలు చదువుకోవడానికి కావలసిన అన్ని వసతులు, సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నిర్దిష్టమైన ప్రణాళికలతో కష్టపడి చదువుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం ఉద్బోధించారు. ఈ సందర్భంగా సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన సీఎం... అంతకుముందు బంజారాలు ప్రదర్శించిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ పోరిక బలరాం నాయక్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

- **మెయిల్ లో హెచ్చరించిన దుండగులు**
- **తనిఖీల్లో లభ్యం కాని బాంబు**
- **రెండు నెలల వ్యవధిలో 23 బెదిరింపులు**

**ముద్ర, హైదరాబాద్ :**

రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోసారి బాంబ్ బెదిరింపు మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేపట్టి... ఫేక్ మెయిల్ గా గుర్తించారు. వివరాల్లోకి వెళితే... ఆదివారం ఉదయం సింగపూర్ హైదరాబాద్ విమానంలో బాంబు పెట్టినట్లు ఓ మెయిల్ వచ్చింది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం ల్యాండ్ అయ్యాక ప్రయాణికులను దింపేశారు. విమానంలో తనిఖీలు చేపట్టారు. ఎక్కడ బాంబ్ లభ్యం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి నేటి వరకు అంటే రెండు నెలల వ్యవధిలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 23 నకిలీ బెదిరింపు కాల్స్ వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ తరహా ఘటనలకు పాల్పడిన పలువురిని ఇప్పటికే గుర్తించి.. పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. మరికొంత మంది విదేశాల నుంచి ఈమెయిల్ ద్వారా ఈ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు దర్యాప్తులో బహిర్గతం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు.



# పక్కనబెడితే సహించం

- **పార్టీ కోసం పని చేసే వాళ్లను గుర్తించాలి**
- **కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళతా**
- **పార్టీ నిర్ణయాల్లో నా సూచనలు పరిగణలోకి తీసుకోవాలి**
- **ఏఐసీసీ కార్యదర్శి సవాంత్ తో మాజీ మంత్రి జీవన్ రెడ్డి**
- **జగిత్యాల ఎమ్మెల్యే, జీవన్ రెడ్డిల మధ్య సయోధ్య**

**ముద్ర, జగిత్యాల :**



పార్టీ కోసం పని చేసే వాళ్లను పక్కనబెడితే కచ్చితంగా నిలదీస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్ కుమార్.. కాంగ్రెస్ లో చేరానని ఒకసారి, చేరలేదని మరోసారి దోబూచలాడుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో తన వర్గానికి బీ ఫామ్ లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ తనకు ఇచ్చిన 16 బీ ఫామ్ లో తొమ్మిది చోట్ల గెలిచామన్న జీవన్ రెడ్డి... అదే సంజయ్ కుమార్ కు 34 బీ ఫామ్ లు ఇస్తే 14 మాత్రమే గెలిచారని చెప్పారు. సంజయ్ పక్కన పెట్టిన 9 మంది ఇండిపెండెంట్లు కూడా గెలిచారని ఏఐసీసీ కార్యదర్శి సవాంత్ కు వివరణ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్సెస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వర్గాల మధ్య కుర్చీలాట కాంగ్రెస్ పార్టీకి తలనొప్పి వ్యవహారంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని అధిష్ఠానం మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఏఐసీసీ కార్యదర్శి సవాంత్‌కు అప్పగించింది. దీంతో సవాంత్, మంత్రి అడ్లూరితో జీవన్ రెడ్డి ఆదివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి పార్టీలో తనకు జరుగుతున్న అన్యాయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లారు. సంజయ్ కుమార్ పార్టీలో చేరిన తర్వాత.. తన వర్గీయులను పక్కనబెడుతూ తన వర్గానికి పెద్దపీట వేసుకుంటున్నారని ఆరోపించారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న సంజయ్‌ను కట్టడి చేయాలని కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సవాంత్ హామీ మేరకు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పిన జీవన్ రెడ్డి.. పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పార్టీ నిర్ణయాల్లో తన ఆలోచనలు, సూచనలు పరిగణలోకి తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. భేటీ అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని జీవన్ రెడ్డి చెప్పారన్నారు. పార్టీ నేతల్లో పొరపచ్చాలున్నప్పటికీ జగిత్యాలపై కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమన్నారు.



## ఆలయాలు చారిత్రక సాక్షాలు..

- **పచ్చల, ఛాయా సోమేశ్వరాలయాలకు యునెస్కో గుర్తింపునివ్వాలి**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**ముద్ర, నల్గొండ :**

నల్లగొండ పట్టణంలోని చారిత్రాత్మక పానగల్ పచ్చల సోమేశ్వరాలయం, ఛాయా సోమేశ్వరాలయాలకు యునెస్కో గుర్తింపు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. వందల ఏళ్ల చరిత్రను సాక్షిగా నిలబెట్టుకున్న ఈ ప్రాచీన దేవాలయాలు తెలంగాణ సంస్కృతి, శిల్పకళ వైభవానికి ప్రతీకలు అని కొనియాడారు. 11-12వ శతాబ్దాలకు చెందిన ఈ ఆలయాల్లో అద్భుతమైన శిల్ప సంపద ఉట్టిపడుతుందని చెప్పారు. ముఖ్యంగా ఛాయా సోమేశ్వరాలయం గర్భగుడిలో ఎల్లప్పుడూ ఒకే విధంగా కనిపించే నీడ విశేష ఆకర్శణ అని గుర్తుచేశారు. ఈ ఆలయాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్, సీపీఐ పొత్తుతో వచ్చిన ఇబ్బందేమీలేదు

- **కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని చెప్పినా వినలేదు**
- **సింగరేణి ప్రయోజనాల కోసమే సీపీఐతో జతకలుద్దామనుకున్నాం**
- **బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను కాంగ్రెస్ నేతలు ప్రలోభపెడుతున్నారు**
- **పోలీసులను, గుండాలను ఇంటికి పంపి బెదిరింపులకు గురి చేస్తున్నారు**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఇప్పటికే పొత్తులో ఉన్న కాంగ్రెస్‌సీపీఐ మధ్య కొత్తగూడెం కార్పొరేషన్ లోనూ ఒప్పందం జరిగితే తమకు వచ్చిన ఇబ్బందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసమే తాము సీపీఐతో కలిసి పనిచేద్దామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని సీపీఐ నేతలతో చెప్పామన్నారు. అయినప్పటికీ సీపీఐ ఏ కారణం చేత పొత్తుకు ఒప్పుకుందో, వాళ్లకు ఏం ఒత్తిళ్లు ఉన్నాయో మాకు తెలియదని వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నాయని ఆరోపించిన కేటీఆర్... సింగరేణిని కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో కేటీఆర్ మాట్లాడారు. ఈ నెల 11న వెలువడ్డ మున్సిపల్ ఎన్నికల్లో హంగ్ వచ్చిన 38 పట్టణాల్లో కాంగ్రెస్ నేతలు అరాచకాలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ఎత్తుకెళ్లి ప్రలోభాలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులను, గుండాలను బీఆర్ఎస్ అభ్యర్థుల ఇళ్లకు పంపి బెదిరింపులకు గురిచేస్తున్నారని విరుచుకుపడ్డారు. అయినా ఎక్కడా బెదరకుండా బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ధైర్యంగా ఉన్నారని చెప్పారు. నేడు జరగనున్న ప్రమాణా స్వీకారంలో సమీకరణాలు మారుతున్నాయన్న ఆయన రాష్ట్రంలో మరిన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

**కేసీఆర్.. గిరిజనుల ఆత్మగౌరవానికి న్యాయం చేశారు**

సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందని కేటీఆర్ తెలిపారు.
లంబాడా తండాలను గ్రామ పంచాయితీలుగా చేసిన మాజీ సీఎం కేసీఆర్ గిరిజనుల ఆత్మగౌరవానికి న్యాయం చేశారని వెల్లడించారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు 3,146 తండాలు, గూడేలను కొత్త గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ చొరవతో ఇప్పుడు 3146 మంది గిరిజన బిడ్డలు సర్పంచ్‌లు అయ్యారని తెలిపారు. గిరిజన తండాల్లో ఇంటింటికీ నీటి వసతి కల్పించామన్న కేటీఆర్.. నాలుగున్నర లక్షల ఎకరాలకు కేసీఆర్ ఒకే రోజు పోడు పట్టాలిచ్చారన్నారు. గిరిజన బిడ్డలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్‌దే అని కేటీఆర్ స్పష్టం చేశారు. గిరిజన బిడ్డల విద్య కోసం వందలాది గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. గిరిజన వ్యాపారవేత్తలకు సీఎంఎస్‌టీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ తీసుకొచ్చామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.లక్షలు ప్రభుత్వ సబ్సిడీ ఇచ్చామని అన్నారు. బంజారా బిడ్డలకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చామని అన్నారు. ప్రతి జిల్లాలో బంజారా భవన్‌కు స్థలం ఇచ్చామని, బంజారా భవన్‌లు కట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో బంజారాలకు మరింత అండగా నిలబడతామని హామీ ఇచ్చారు.

# అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి

- **డిజిపి బి.శివధర్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ:**



అజ్ఞాతంలో ఉన్న సీపీఐ (మావోయిస్టు) పార్టీ నాయకులు, కేడర్ ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శశిధర్ రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన పిలుపు మేరకు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న వారంతా తిరిగి వచ్చి తమ కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతమైన, సురక్షితమైన, గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని డిజిపి బి. శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. గత రెండేళ్ల కాలంలో తెలంగాణ పోలీసుల నిరంతర కృషి ఫలితంగా వివిధ స్థాయిలకు చెందిన 588 మంది తెలంగాణ, చత్తీస్ ఘడ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు లొంగిపోయి సాధారణ జీవితంలోకి ప్రవేశించారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. వీరందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస పథకం కింద లభించే అన్ని రకాల ప్రయోజనాలను అందజేశామని, ప్రస్తుతం వీరంతా తమ సొంత గ్రామాల్లో కుటుంబాలతో కలిసి ఎంతో క్షేమంగా, సంతోషంగా జీవిస్తున్నారని డిజిపి వారిని అభినందించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మిగిలిన 15 మంది మావోయిస్టు నాయకులు, కేడర్ ఈ అవకాశాన్ని వినియోగించుకుని శాంతియుత భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని డిజిపి బి.శివధర్ రెడ్డి పునరుద్ఘాటించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందజేయడంతో పాటు, వారు సమాజంలో ఆత్మగౌరవంతో బతికేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని భరోసా ఇచ్చారు. శాంతియుత మార్గాల ద్వారానే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, సాయుధ మార్గం, అజ్ఞాతవాసం వీడి బయటకు రావడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని డిజిపి బి.శివధర్ రెడ్డి సూచించారు.

## నారాయణ పేట కు ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి

**ముద్ర, నారాయణపేట:**



కొన్ని నెలల నుంచి నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేదు. గతంలో ఓ మారు ఎమ్మెల్యే కాలుకు గాయమైంది. ఈ సమయంలో డాక్టర్లు నడవకుండా ఎమ్మెల్యేకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యే చాలా రోజులు నారాయణ పేట నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉన్నారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఎక్కడా కూడా ప్రచారానికి పూర్తి దూరంగా ఉన్నారు. కానీ నారాయణపేట మున్సిపల్ ఎన్నికలు అయిన తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కు ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి ఎక్స్ అఫీషియో ఓటు అనివార్యం కావడంతో ఆదివారం సివి ఆర్ బంగ్లాకు ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి చేరుకుంది. అయితే చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునేందుకు గట్టి ప్రయత్నంలో భాగంగానే ఎమ్మెల్యే తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడికి వచ్చినట్లు తెలుస్తుంది.

# ఆ ఒక్క పీఠాన్నీ రేవంత్ లాక్కొంటున్నాడు

- **వడ్డేపల్లి మున్సిపాలిటీ కోసం సీఎం పావులు**
- **64 సీట్లు వచ్చినా ఇంకా రేవంత్ కు అగడేందుకూ..?**
- **ఈ వెగటు రాజకీయాలు చేసే బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది**
- **సేవాలాల్, ఆదివాసీ, ఎరుకల తెగల పేరుతో కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలి**
- **సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యాశ్యంగా చేర్చాలి**
- **జాగృతి అధ్యక్షురాలు కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి తరపున తాము గెలుచుకున్న ఒక్క పురపీఠాన్నీ సీఎం రేవంత్ రెడ్డి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. రాష్ట్రంలో 64 సీట్లు వచ్చిన కూడా ఇంకా అగడు ఎందుకని సీఎంను ప్రశ్నించారు. ఈ వెగటు రాజకీయాలు చేసే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ కు కూడా ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం, అడిగే వాళ్లు ఉండకూడదనే ధోరణితో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సేవాలాల్ 287 వ జయంతి వేడుకలను ఆదివారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ పేరుతో, ఆదివాసీల పేరుతో, ఎరుకల తెగ పేరుతో ఏర్పాటు చేస్తామన్న మూడు కార్పొరేషన్లను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నల్గొండ, నిజామాబాద్, ఖమ్మం, మహబూబాబాద్ లో ఐటీడీఏ లు పెట్టాల్సిందేనన్నారు. ఐటీడీఏ లలోనే ఉద్యోగాల రిక్రూట్ మెంట్ నిర్వహిస్తామన్న కాంగ్రెస్ నేతలు అధికారంలో వచ్చాకా వాటిని పట్టించుకోవటం లేదని ఆరోపించారు. సేవాలాల్ జయంతిని జరుపుకోవటం సంతోషంగా ఉందని కవిత అన్నారు. దేశవ్యాప్తంగా బంజారా జాతి మేలు కోసం కృషి చేసిన సేవాలాల్ జీవిత చరిత్రను దేశ వ్యాప్తంగా పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చాలన్నారు. వెనుకబడిన జాతిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. జీవో 33 ప్రకారం గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- **ప్రధాని మోదీ**

**ముద్ర, ఢిల్లీ:**



గడిచిన దశాబ్ద కాలంగా రక్షణ రంగంలో తీసుకువస్తున్న సంస్కరణల ప్రయోజనాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో స్పష్టంగా కనిపించాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ ఎప్పుడూ సంసిద్ధతతో ఉండాలన్న ఆయన.. రక్షణ రంగాన్ని ఆధునికీకరించడంతో పాటు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన మోదీ.. అనేక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

**వాణిజ్య ఒప్పందాలతో ప్రయోజనం..**

యూపీఏ ప్రభుత్వ హయాంలో వాణిజ్య చర్చలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. వారి ఆర్థిక నిర్వహణ సరిగ్గా లేని కారణంగా విశ్వసనీయతతో భారత్ చర్చలు జరపలేక పోయిందన్నారు. తద్వారా ఏ చర్చలనూ పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. తమ హయాంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే, ఈయూ, అమెరికాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలతో ఎంఎస్ఎంఈలకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ముఖ్యంగా కార్మిక ఆధారిత రంగాలకు లబ్ధి చేకూరిందని, ఆయా దేశాలకు తక్కువ సుంకాలతోనే ఎగుమతుల చేసుకునే వీలు కలిగిందన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 16.02.2026
www.mudranews.in
@mudranews
mudratv



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## బంజారాల ఆరాధ్య దైవం
# సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్



భారతదేశంలోని గిరిజన తెగలలో ఒకటైన బంజారా (లంబాడీ) సమాజానికి వెలుగు చూపిన మహనీయుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్. 18వ శతాబ్దంలో జీవించిన ఆయన, కేవలం ఒక ఆధ్యాత్మిక గురువుగానే కాకుండా, మూఢనమ్మ కాలకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక సంస్కర్తగా, అహింసావాదిగా చిరస్థాయిగా నిలిచిపోయారు. దుర్లభం భారతం వర్షే అని శాస్త్ర వచనం. భారత దేశంలో జన్మించటమే మహా దుర్లభం అని అర్థం. ఇక్కడ మనిషి పుట్టుకకు కారణం వెతుక్కునే అవకాశం ఉంది. అలాంటి కారణ జన్ములు అనేకులు మన భారతగడ్డ పై జన్మించారు. అలాంటి వారిలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఒకరు. సేవాలాల్ బంజారాల ఆరాధ్య దైవంగా నిలిచాడు. ఆయన లిపిలేని బంజా రాల భాషను ఒక పద్ధతిగా మార్చాడు. 10 కోట్ల లంబాడా ప్రజలు ఎక్కడైనా ఒకే రకంగా నేడు మాట్లాడుకోగలుగుతున్నారు. స్థిర నివాసం లేకున్నా తమ కట్టుబా ట్లు , ఆచారవ్యవహారాలు, విలక్షణమైన దుస్తులు, ఆభరణాలతో బంజారాలు తమ ప్రత్యేకతను నిలుపుకుంటున్నారు. "సాతీ భవానీ (సప్త మాతృకల)'' పూజా విధానాలు ఆచరించే బంజారాల జాతికి ఆయనే దార్శనికుడు. రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు బంజారాలు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగించేవారు. ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లిం పాలకుల మత ప్రచారంతో బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురయ్యింది. అలాంటి పరిస్థితులలో బంజారాలను మంచిమార్గంలో నడిపించడా నికి సేవాలాల్ అవతరించారు.ఆయన బోధనల ద్వారా బంజారా జాతినడచు కుంది. 1739 ఫిబ్రవరి 15న అనంతపూర్ జిల్లా రాంజీనాయక్ తండాలో భీమా నాయక్, ధర్మిణి భాయి దంపతులకు జన్మించాడు. చిన్నతనం నుంచే ఆయనలో సేవాగుణం ఉండేది. ఆవులు కాయడానికి వెళ్తేటప్పుడు తల్లి కట్టియిచ్చిన సద్దిని తాను తినకుండా ఆకలితో ఉన్నవాళ్లకు పెట్టేసే వాడు. తాను బంకమట్టితో రొట్టెలు చేసుకొని తినేవాడు. ఈ వింత ప్రవర్తన తల్లితండ్రులకు, తండాలోని జనాలకు ఆశ్చర్యం కలిగించేది. జాతర్ల సమయంలో జంతుబలిని ఒప్పుకునేవాడు కాదు. 'ఒకవేళ అమ్మవారికి బలి ఇష్టమైతే నేనే బలై పోతాను' అని సేవాలాల్ అమ్మవారి కాళ్ల దగ్గర తన తలను ఉంచుతాడు.'నా రక్తాన్ని నైవేద్యంగా స్వీకరించి బంజారా లకు వరాలు ఇవ్వమ'ని ప్రార్థిస్తాడు. అమ్మవారు కరుణిస్తుంది. 'నిజమైన భక్తుడు సమాజానికి సేవకుడు. అతని నాయకత్వంలో ప్రయాణించండి' అని జగదాంబ ఆశీర్వదిస్తుంది. అప్పటి నుంచి జగదాంబ మాతనే తన గురువుగా స్వీకరించాడు. అన్ని విద్యలను నేర్చుకొని బంజారాల సేవలో నిమగ్నమయ్యాడు. సేవాలాల్ మహరాజ్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారు. వీరిలో 'పెరిఫర్' ఒకటి. ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులు అరికట్టడం, క్షేత్ర ధర్మాన్ని రక్షించడం మొదలైనవి ముఖ్యమైనవి. అహింస మహా పాపమని, మద్యం , ధూమపానం శాపమని హితవు పలికాడు. ఆ రోజుల్లోనే బంజారాల పరువు ప్రతిష్టల గురించి ఊహించి అహింస సిద్ధాంతానికి పునాది వేశాడు. ఒకప్పుడు హైదరాబాదులో మశూచి వ్యాధి ప్రబలింది. అయితే, సంత్ సేవాలాల్ మహారాజ్ ఉన్న బంజారా హిల్స్ ప్రాంతానికి మాత్రం ఆ వ్యాధి సోకలేదు. ఆయన మహిమ ను గుర్తించిన రాజు... సేవాలాల్ ఆశీస్సులతో ఆ వ్యాధిని నిర్మూలించాడని చరిత్ర తెలుపుతోంది.

### *గిరిజనుల గొప్పతనం

బంజారాలు రాజపుత్రుల్లాంటి వారని చరిత్ర కారుడు కల్నల్ టాడ్ పేర్కొన్నా రంటే... వారెంత దృఢకాయులో అర్థం అవుతుంది. లంబాడీలు, బంజారాలు, సుగాలీలు, గ్వార్ భాయ్ అని పిలవబడుతున్న ఈ గిరిజనులు ప్రపంచవ్యాప్తంగా గోర్ బంజారాలుగా పేరుపొందారు. మధ్య యుగంలో మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ పక్షాన పోరాడిన వీరోచిత చరిత్ర బంజారాల సొంతం. దక్కన్ పీఠభూమిలో లంబాడీలు కాకతీయుల కంటే ముందే ఉన్నారని, సంచార జాతివారైనా వీరు రజాకార్లతో పోరాడారని, నవాబులు వారి ధైర్యసాహ సాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చారని చరిత్ర చెబుతోంది. బంజారాలు ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని, సహాయ గుణం విరివిగా కలవారని, ధైర్యసాహసాలకు ప్రతీకలనీ చరిత్ర ద్వారా తెలుస్తుంది. తరతరాలుగా జాతి వివక్షకు గురవుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిలో వెనుకబడి ఉన్న లంబాడాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముంది

- జటావత్ రాజు
(యువ కవి రచయిత ;అరుణ రైటింగ్స్)
తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్. 9347196264.

## బడి బంధం

పొద్దున ఇంటి కిటికీ తెరిస్తే
పక్కనున్న బడి కనిపిస్తుంది
పిల్లల కేరింతలు నన్ను
వాళ్లలో కలిపేసుకుంటాయి

నిత్యం నా దినచర్య
బడిగంటతోనే సురువు
ఆ గంట గతంలోని ముచ్చట్లను
సన్నాయిలా మోగిస్తుంది

మా అప్పుడు సంచులు లేవు
పుస్తకాలు భుజంపై మోసేవాళ్ళం
ఇప్పుడైతే బస్తాలతో మోస్తున్నారు
అభివృద్ధికి ఆనవాలు కాబోలు

మా కారిడార్ లో నిల్చొని
వందేమాతరం తిలకిస్తూ
చేజారిన కాలాన్ని జ్ఞాపకాల
గంగలో తడుముకుంటాను

గురువులను చూస్తుంటే
మా చిన్నప్పటి గురువులు
ఇంకా నా చెయ్యి పట్టుకుని
నడిపిస్తున్నట్టే భావన

ఆఫీసుకు, బడికి ఒకేసారి
సెలవులప్పుడు నాకేమి తోచదు
బీచులో పిట్టగూళ్ళు కట్టినట్టు
కలల సముద్రంలో ఈదుతాను

బడి జీవితం అయిపోయినా
బడి తోనే పెరిగాను ఊర్లో
ఇంటి పక్కనే ఇంకో బడి ఉండేది
నాకొక జీవితాన్ని ప్రసాదించి
నన్ను పరిపూర్ణుడిని చేసింది

పట్నం వచ్చినా
బడి నాతోనే వచ్చింది
బడికి నేను ఇష్టమో
నాకు బడి ఇష్టమో కానీ
మాది విడదీయలేని బంధం

ఊర్లకు వలసలుండవు కదా
అందుకే నేనే వెళ్ళాలి
పట్నం బాధలను చెప్పుకోవాలి
ఎనర్జీ బూస్ట్ చేసుకోవాలి

ఊరు బతుకునిస్తే
బడి జ్ఞానం ఇచ్చింది
ఇప్పటికీ బాలుణ్ణి చేస్తుంది
మాది మరపురాని అనుబంధం !

-న్యాలకంటి నారాయణ
9550833490



# తెలుగు పత్రికా రంగానికి మార్గనిర్దేశకుడు నార్ల

### ఫిబ్రవరి 16 నార్ల వెంకటేశ్వరరావు వర్ధంతి





ఎడిటర్ గా ఆయన రాసిన సంపాదకీయలు ఎన్నో సంచలనాలు సృష్టించాయి. మరెన్నో సమస్యల పరిష్కారానికి దారులు వేశాయి. తనకు నచ్చని సంఘటనలు జరిగితే, తెగదెంచుకొని సంస్థలను వదిలివేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. నవ్యతనూ, నాణ్యతనూ మేళవించి తెలుగు పత్రికారంగానికి ఆయన శోభను తీసుకువచ్చారు. నార్ల పాత్రికేయుడు మాత్రమే కాదు సాహితీవేత్త, కవి, రచయిత, ఉద్యమకారుడు, హేతువాది, మానవవాది. అనేక కవితా ఖండికలు, పద్య సంకలనాలు, సాంఘిక, పౌరాణిక నాటకాలు, వ్యాసాలు రాశారు. వివిధ దేశాల చరిత్రలు, ఎందరో మహానుభావుల జీవిత చరిత్రలు, విజ్ఞాన, నైతిక విలువలను సామాన్య ప్రజానీకానికి పరిచయం చేశారు. ఆయనకు తెలుగుపైనే కాదు ఆంగ్లంపైన కూడా మంచి పట్టు ఉండేది. ఆంగ్లంలో కూడా అనేక రచనలు చేసి పలువురు ప్రశంసలు పొందారు. మూఢ నమ్మకాలు, ఛాందసాలను విమర్శించారు. సామాజి పరిణామాలను భౌతికవాద దృష్టితో పరిశీలించడం నార్ల ప్రత్యేకత.

నార్ల వెంకటేశ్వరరావు పూర్వీకులు మధ్యప్రదేశ్ కు వలస వెళ్ళారు.వారిది వ్యవసాయ కుటుంబం. సైనికులకు కావలసిన ఆహారధాన్యాలు పంపిణీ చేసే కాంట్రాక్టర్లుగా పని చేసేవారు. 1డిసెంబర్ 1908లో లక్ష్మణరావు, మహాలక్ష్మి దంపతులకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్ పూర్ లో నార్ల వెంకటేశ్వరరావు జన్మించాడు.తరువాత నార్ల తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ కు తిరిగి వచ్చారు.నార్ల విద్యాభ్యాసం ఆంధ్రప్రదేశ్ లో జరిగింది.పాఠశాల విద్యాభ్యాసం పూర్తయిన తరువాత నార్ల వెంకటేశ్వరరావు మచిలీపట్నం లోని నోబుల్ కళాశాలలో బి.ఏ. పూర్తి చేశాడు.

నార్ల చదువుకొనే రోజులలో కృష్ణాపత్రికలో పార్టం సబ్ ఎడిటర్ గా పనిచేశాడు.పట్టాభి సీతారామయ్య గారి 'జన్మభూమి' పత్రికకు, పూనా నుండి వెలువడే 'మహరాటా' అనే పత్రికకు, లాహోర్ నుండి వచ్చే 'పీపుల్స్' అనే పత్రికకు వ్యాసాలు రాసి పంపేవాడు. ఆ పత్రికల ద్వారా వచ్చే కొద్దిపాటి సొమ్ముతో కళాశాల ఫీజులు కట్టేవాడు.ఆ రోజుల్లో వెంకటేశ్వరరావు రాసిన 'స్వదేశీ సంస్థానాలు' అనే పుస్తకం గూర్చి కృష్ణా పత్రికలో దాని సంపాదకులు ముట్నూరి కృష్ణారావు గారు సమీక్ష చేశారు. భారతదేశం గురించి రాసిన 'స్వదేశీ సంస్థానాలు అనే రచన అద్భుతమైనది' అని అభినందించారు.వెయ్యి పుస్తకాలు కేవలం 3 నెలలలోనే అమ్ముడు పోయాయి.ఇది ఆ రోజుల్లో ఒక రికార్డు.తరువాత 'నేటి రష్యా' అనే తెలుగు పుస్తకం నార్ల వారు రాసారు.

నార్ల వెంకటేశ్వరరావు సంపాదకుడు మాత్రమే కాక మంచి రచయిత కూడా తెలుగులో,ఆంగ్లంలో ఎన్నో రచనలు చేశాడు.సీత జోస్యం, జాబాలి,నరకంలో హరిశ్చంద్రుడు, ద్రౌపది, హిరణ్యకశ్యప కథ, నవయుగాల బాట నార్ల మాట, దేశ చరిత్రలు,సాంఘిక నాటికలు, ఆషామాషీ, మాటామంతీ, కొత్తగడ్డ మొదలైన ఎన్నో రచనలు చేశాడు. బుద్ధుని ఆరాధించాడు.బౌద్ధ కళాఖండాలు,శివుని విగ్రహాలు, కృష్ణుని విగ్రహాలు సేకరించి ఇంట్లో చిన్న మ్యూజియం ఏర్పాటు చేశాడు.20,000 పుస్తకాలు సేకరించి, ఇంటిలోనే ఒక గ్రంథాలయం ఏర్పాటు చేశాడు.

1958–1970 మధ్య కాలంలో నార్ల వెంకటేశ్వరరావు రాజ్యసభ సభ్యుడుగా ఎన్నికయ్యాడు. పారిస్ లో జరిగిన యునెస్కో సాధారణ సమావేశాలకు హాజరైన భారత ప్రతినిధి బృందంలో నార్ల ఒక సభ్యునిగా ఉన్నాడు. అనేక అంతర్జాతీయ,జాతీయ సమావేశాలలో పాల్గొని తన అభిప్రాయాలను నిస్సంకోచంగా చెప్పాడు. కొంత కాలం యన్.టి. రామారావుకు సాంస్కృతిక వ్యవహారాల సలహాదారునిగా ఉన్నాడు.

గొప్ప మానవతావాది, హేతువాది, పత్రికా సంపాదకత్వంలో నూతన ఒరవడి సృష్టించిన మేధావి నార్ల వెంకటేశ్వరరావు 16 ఫిబ్రవరి 1985లో మరణించాడు. నార్ల మరణించిన తరువాత ఆయన సతీమణి సులోచనా దేవి నార్ల సేకరించిన 25,000 గ్రంథాలను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి అందజేశారు.

- సుధాకర్.ఏ.వి
★ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
★ స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
★ 9000674747



# బంగ్లాదేశ్ తో భారత్ బంధం బలపడేనా?

### బంగ్లాదేశ్ లో వేగంగా మారిన రాజకీయ పరిణామాలు?



భారతదేశ సరిహద్దుల్లో ఉన్న బంగ్లాదేశ్ లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతూ వచ్చాయి. ఫిబ్రవరి 12న నిర్వహించిన బంగ్లా జనరల్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనల్ లిస్టు పార్టీ (బీఎన్ పి) ఏకంగా మూడింట రెండు వంతులకు పైగా మెజార్టీతో ఘన విజయం సాధించింది. మొత్తం 300 స్థానాలకు గాను 297 చోట్ల ఫలితాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. వాటిలో బి ఎన్ పి 209 సీట్లు గెలుచుకుంది. కరుడుగట్టిన భారత్ వ్యతిరేకిగా, పాక్ తాబేదారుగా ముద్రపడ్డ జమాతే ఇస్లామీ పార్టీ 68 సీట్లకు పరిమితం అయింది. దానితో జత కట్టిన 10 ఇతర పార్టీలు దాదాపుగా మట్టి కరిచాయి.2024 ఆందోళనల అనంతరం విద్యార్థుల ఆధ్వర్యంలో పుట్టుకొచ్చిన జమాతే సంకీర్ణ భాగస్వామి నేషనల్ సిటిజనల్ పార్టీ కేవలం 6 స్థానాల్లో నెగ్గగా, 7 చోట్ల స్వతంత్రులు విజయం సాధించారు. ప్రధాన ప్రతిపక్షమైన షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగును ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం తెలిసిందే.

### బంగ్లాలో వేగంగా రాజకీయ పరిణామాలు:

విద్యార్థుల ముసుగులో 2024 ఆగస్టులో చెలరేగిన దేశ వ్యాప్త ఆందోళనలతో నాటి ప్రధాని అవామీ లీగ్ సారధి షేక్ హసీనా గద్దె దిగాల్సి వచ్చింది. అంతేకాక రాత్రికి రాత్రే ఆమె దేశం వీడి భారత్ చేరుకున్నారు. అనంతరం బంగ్లాలో అల్లకల్లోలం, అస్థిరత నెలకొన్నాయి. ఎటు చూసినా హింసాకాండ పెచ్చరిల్లింది. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనుస్ సారధ్యంలో ఏర్పడ్డ మధ్యంతర సర్కార్ వాటికి అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమైంది. బంగ్లాలో పరిస్థితులు పెనం నుంచి పొయ్యిలోకి జారి రాజకీయ శూన్యం నెలకొన్న పరిస్థితులు ఏర్పడ్డవి.

### బి ఎన్ పి నేతకు బ్రహ్మరథం :

బంగ్లాలో రాజకీయ అనిచ్చిత పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో రాజకీయ వాతావరణానికి ఎదురుచూస్తున్న బి ఎన్ పి నేత గత డిసెంబర్ 25న తారిక్ రహమాన్ ప్రవాసం వీడి సొంత గడ్డపై అడుగు పెట్టాడు. బి ఎన్ పి( బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ) కార్యకర్తలతో పాటు అభిమానులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు.వీరు బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్, మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు. రెహమాన్ 19 ఏళ్ల ప్రవాసంలో ఉంటూ ఇటీవల బంగ్లాకు తిరిగి రావడం విశేషం.2001 నుంచి 2006 మధ్య ప్రధాని ఖలీదా జియా హయాములో రెహమాన్ రెండో అధికారి కేంద్రంగా మారారన్న చెడ్డ పేరు మూగట్టుకున్నారు. పాలనలో అన్ని వ్యవహారాలను తన కనుసన్నల్లో శాశించారంటారు. దాంతో విపక్షాలు, సొంత పార్టీలోని అసమ్మతివాదులే గాక అమెరికా కూడా రెహమాన్ 'డార్క్ ప్రిన్స్' గా అభివర్ణించారు. అంతేగాక ఆ సమయంలో ఆయనపై లెక్కకు మించి అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన అవామీ లీగ్ సారథి షేక్ హసీనా వాటిపై విచారణకు ఆదేశించారు. ఒక కేసులో రెహమాన్ అరెస్టయ్యారు. బెయిల్ పై విడుదలైన అనంతరం వైద్య చికిత్స పేరుతో 2008 లో లండన్ వెళ్లారు. నాటి నుంచి కుటుంబంతో పాటు అక్కడే ప్రవాసం లో గడుపుతూ వచ్చారు. లండన్ నుంచే పార్టీ కార్యకలాపాలు పర్యవేక్షిస్తూ వచ్చారు.అవామి లీగ్ నాయకురాలు షేక్ హసీనా సర్కారును కుప్పకూల్చిన దేశవ్యాప్త ఆందోళనల నేపథ్యంలో బంగ్లాదేశ్ లో ఏడాదిన్నరకు పైగా కొనసాగుతున్న అల్ల కల్లోలం.

### 20 ఏళ్ల తర్వాత అధికారం :

ఎన్నికల్లో ఘనవిజయం నేపథ్యంలో బిఎన్ పి చైర్మన్ తారిక్ రెహ్మాన్ (60) తొలిసారి దేశ ప్రధానిగా ఏకంగా 20 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అధికార పగ్గాలు చేపట్టనుండటం విశేషం. 2024 ఆగస్టులో విద్యార్థుల ముసుగులో ఆందోళనలు హసీనా 15 ఏళ్ల పాలనకు తెరదించడం, నాటి నుంచి ఒక రకంగా బంగ్లాలో రాజకీయ సూన్యమే నెలకొంది. దేశ పాలన వ్యవహారాలను ఏడాది నరకుపైగా నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనుస్ సారధ్యంలోని మధ్యంతర ప్రభుత్వమే చూస్తూ వస్తున్నప్పటికి.. దేశంలో జరుగుతున్న అల్లర్లను అణచడం లో ముఖ్యంగా హిందువుల మైనార్టీలపైన దేశవ్యాప్తంగా హెచ్చరిల్లుతున్న దాడులను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమైందన్న చెడ్డ పేరు మూట కట్టుకుంది.

### సంస్కరణలకు జై :

బంగ్లాదేశ్లో భారీ ప్రజాస్వామ్య సంస్కరణకు ప్రజలు జై కొట్టారు. ఇందుకోసం సాధారణ ఎన్నికలతో పాటుగా నిర్వహించిన రెఫరండానికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. రేఫరెండంలో భాగంగా ప్రతిపాదించిన సంస్కరణల ప్యాకేజీకి మద్దతు పలుకుతూ అనుకూలంగా ఏకంగా 60.26% ఓట్లు పడ్డట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. హసీనా పదవీచుతి అనంతరం తాత్కాలికంగా పాలన పగ్గాలు చేపట్టిన యూనుస్ గ తేడాది ఈ సంస్కరణలను ప్రతిపాదించారు.

### బంగ్లా ఎన్నికలపై ప్రపంచ దేశాలు స్పందన:

బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికలపై అంతర్జాతీయ స్థాయిలో స్పందనలు వచ్చాయి. తారీక్ రెహమాన్ కు భారత ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలియజేస్తూ, ప్రజాస్వామ్య, ప్రగతిశీల, సమగ్ర బంగ్లాదేశ్ కు భారత్ మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. చైనా బంగ్లాదేశ్ లో సాదారణ ఎన్నికలు స్థిరంగా, సజావుగా జరిగాయని బిఎన్పి స్పష్టమైన మెజార్టీ సాధించినందుకు.. బంగ్లాదేశ్ తన అంతర్గత రాజకీయ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లడాన్ని చైనా మద్దతిస్తుందని, బంగ్లాదేశ్ వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు డాకా తో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని చైనా విదేశాంగ శాఖ మంత్రి తెలిపారు. డాకాలోని అమెరికా రాయబార కార్యాలయం కూడా ప్రజలకు బి.ఎన్.పి కి అభినందనలు తెలియజేసి పరస్పర అభివృద్ధి, భద్రతా లక్ష్యాలతో సాధనతో కలిసి పనిచేయాలని తెలిపింది.

బంగ్లాదేశ్ పునర్నిర్మాణమే ప్రాధాన్యం:

ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీ సాధించిన బి.ఎన్.పి చైర్మన్ కాబోయే ప్రధానమంత్రి తారీక్ రెహమాన్ బంగ్లాదేశ్ జాతీయ ఐక్యతకు పిలుపునిచ్చారు. అవినీతి వ్యతిరేక పోరాటంలో పౌరులందరూ కలిసి రావాలని, శాంతి భద్రతలకు కట్టుబడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, దేశాన్ని సురక్షితంగా, మానవత ఉట్టిపడే జాతిగా ఉంచాలని కోరారు. దేశ ఐక్యత, చట్టబద్ధ పాలన, శాంతియుత ప్రవర్తనలే తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని, ప్రజల జీవన విధానాలను మెరుగుపరచడం, వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించి పటిష్టం చేయడమే తక్షణ లక్ష్యమన్నారు. అన్ని మతాలను పేరుపేరునా ప్రస్తావించి సమానంగా చూస్తానని సందేశం ఇచ్చాడు. భారత్తో ఘర్షణ పడే ఉద్దేశం లేదని, వాణిజ్యం, నీటి పంపకాలు ఇత్యాది విషయాల్లో సానుకూళంగా ఉంటామని తెలిపారు.

### 18తేదీ నాటికి కొత్త మంత్రి వర్గం:

బంగ్లాదేశ్ లో కొత్త మంత్రివర్గం ఈ నెల 18 వ తేదీనాటికి ప్రమాణ స్వీకారం చేస్తుందని క్యాబినెట్ కార్యదర్శి డాక్టర్ షేక్ అబ్దుల్ రఫీ ప్రకటించారు 17వ తేదీ నాటికి ఎంపీల ప్రమాణస్వీకారం పూర్తి కావాల్సి ఉంది.

- ఉజ్జిని
రత్నాకర్ రావు
9490942646



**టాప్ 10 భారత్-పాక్ మ్యాచ్ లు**

1999 వరల్డ్ కప్ (మాంచెస్టర్) కార్గిల్ యుద్ధం సమయంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఒత్తిడిని జయించి గెలిచింది. వెంకటేష్ ప్రసాద్ బౌలింగ్ హైలైట్.




## విస్తృతంగా వీకెండ్–స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- **196 మందిపై కేసులు నమోదు**

**ముద్ర, శేరిలింగంపల్లి :**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 196 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు. వీరిలో 140 ద్విచక్ర వాహనదారులు, 13 ఆటోలు, 41 కార్లు, రెండు హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయని వివరించారు. వీరందరినీ కోర్టుకు హాజరుపర్చనున్నట్లు చెప్పారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని డీసీపీ తెలిపారు. కాగా గత వారంలో మొత్తం 212 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయన్నారు.

## నేడు మున్సిపల్ చైర్ పర్సన్ ప్రమాణ స్వీకారం




**ముద్ర, తాండూర్:**
వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవుల నియామకం ఖరారైంది. బీసీ కోటాలో 12వ వార్డు నుంచి హ్యాట్రిక్ కౌన్సిలర్‌గా గెలుపొందిన పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డికి చైర్‌పర్సన్ పదవి దక్కింది. ఇప్పటికే రెండు పర్యాయాలు మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆమె వైపు మొగ్గు చూపారు. అలాగే మైనారిటీ కోటాలో హ్యాట్రిక్ కౌన్సిలర్‌గా గెలిచిన అబ్దుల్ రజాక్‌ను వైస్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాయిపూర్ ప్రాంత ప్రజల ఆశలు నెరవేర్చినందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి స్థానిక కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## భారతీయ కిసాన్ సంఘటన్ దక్షిణ భారత కన్వీనర్ నియామకం

**ముద్ర, శేరిలింగంపల్లి :**
భారతదేశంలో ప్రముఖ ప్రజాస్వామ్య రైతు సంస్థగా పేరొందిన భారతీయ కిసాన్ సంగతన్(బీకేఎస్) దక్షిణ భారత కన్వీనర్‌గా యర్రం శ్రీరాం రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ రైతుల సమగ్ర అభివృద్ధి, స్వావలంబన, ప్రభుత్వ పథకాల అమలు బలోపేతం దిశగా ఈ నియామకం కీలకంగా మారుతుందన్నారు.. దక్షిణ భారత రాష్ట్రాలలో వ్యవసాయ నూతన సాంకేతికత, రైతు సంక్షేమం, ప్రభుత్వ పథకాల లబ్ధి రైతులకు చేరేలా సమన్వయం చేయడం తన ప్రధాన లక్ష్యమని శ్రీరాం రెడ్డి తెలిపారు. పంట బీమా పథకాలు సమర్థంగా అమలు చేయడం, అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు (ఏంఎస్పి) హామీ ఇవ్వడం, సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేయడం, అప్పుల బారిన పడిన రైతులకు ఉపశమనం కల్పించడం వంటి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని




డిమాండ్ చేశారు. రైతులు దేశానికి వెన్నెముక మాత్రమే కాక జీవనాడి అని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన బీకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కమ్ జాతీయ కన్వీనర్ యర్రం వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పీఎం కిసాన్ సమాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు వంటి ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల చివరి రైతు వరకు చేరేలా కృషి చేస్తానని తెలిపారు.



మేడ్చల్ లో..



# శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

**ముద్ర ప్రతినిధి, మేడ్చల్ జిల్లా :**
మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం భక్త జనసంద్రమైంది. తెల్లవారుజామున నుండే భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం తరుపున మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా కీసర గుట్ట పరిసరాలు భక్తుల శివనామ స్మరణతో మార్మోగుతున్నాయి.మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఇతర వీఐపీలు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అడుగడుగునా నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. అయితే భక్తులు ఒకే సారి పెద్ద సంఖ్యలో పోటెత్తడంతో కొద్ది సేపు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వివిధ ప్రాంతాల నుండి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు.

**శేరిలింగపల్లిలో..**
శేరిలింగపల్లి : మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు శివాలయాల్లో జరుగుతున్న ఉత్సవాల్లో పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పరమశివుని ఆశిస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరారు. శివుడికి అతి పవిత్రమైన రోజున ఆయనకు పూజలు చేయడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని హైదర్ నగర్ హెచ్ఎంటి కాలనీ రామాలయంలోని శివాలయంలో తాజా మాజీ కార్పోరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి పూజలు నిర్వహించారు. రాఘవేంద్ర కాలనీ ఇందాహిల్స్‌లోని శివాలయాల్లో తాజా మాజీ కార్పోరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేశ్ గౌడ్‌తో కలిసి పూజలు నిర్వహించారు. కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ కాలనీలో వీరాంజనేయ ఆలయంలో, వివేకానందనగర్ డివిజన్లోని బాగ్ అమీన్ పూర్ బాలాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన అభిషేకంలో పాల్గొన్నారు. పూజ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శేరిలింగపల్లిలో..



తాండూర్ లో..

**కూచిపూడి నృత్య ప్రదర్శన..**
శిల్పారామం మాదాపూర్లో శివరాత్రి పండుగ పురస్కరించుకొని శ్రీగీతికా కూచిపూడి ఆర్ట్ అకాడమీ గురువర్యులు లక్ష్మి కృష్ణ శిష్య బృందం మహా గణపతిమ్, శ్రీ విఘ్న రాజాం భజే, శివ శంభో, తిల్లాన, శివ స్తుతి, నటరాజ తాండవం, నృత్యాంజలి తిల్లాన, ఆంగికం మహా దేవా శంకర, శివోహం, కల భైరవాష్టకం, ప్రభు ప్రాణానాదం, ఆది యోగ, నటరాజ నీపాదం, నాగ స్తుతి, శివ భరణం, నటరాజ యోగేశా, చిదంబర నటనం, నాగ భూషిత, ఓం సర్వేశ్వరాయ శివ హారతి మొదలైన అంశాలను ప్రదర్శించారు. సాత్విక, స్ఫూర్తి, శ్రీ శాన్వి, దుర్గ ప్రసన్న, లోకాంక్ష, తనిష్క, సంకీర్తన, చైత్రిక, అద్విత, అనన్య, లక్ష్మి సహస్ర, అక్షిత, శ్రీ వార్షిత, అక్షయ, కీర్తన ఈషా వంటి 150మంది కళాకారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు.

**కూకట్‌పల్లిలో..**
హైదరాబాద్ (కూకట్‌పల్లి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా శివనామస్మరణ మారుమోగింది. నియోజకవర్గంలోని పలు శివాలయాల్లో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీల ఆహ్వానం మేరకు టిపిసిసి ఉపాధ్యక్షులు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ బండి రమేష్ పలు దేవాలయాలను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐడియల్ రోడ్డులోని శ్రీ పాప నాశేశ్వర దేవాలయం, కూకట్‌పల్లిలోని పాత శివాలయం, పాండురంగ నగర్‌లోని శివాలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన శివునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కుల వెంకటేశ్వర్ రావు, వివిధ ఆలయ కమిటీల సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా కూకట్పల్లి నియోజకవర్గం ఎవిబి పురంలోని శ్రీశ్రీ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ లక్ష్మి నారాయణ, కాలనీ ప్రెసిడెంట్ సింహాద్రి ఆహ్వానం మేరకు కూకట్పల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్ లో..**
తాండూర్ : వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం అంతారంతాండలో వెలసిన ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. దేవాలయ వ్యవస్థాపకులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత శంకర్ నాయక్, వాసు నాయక్ ఆధ్వర్యంలో ప్రతియేటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇక్కడ ప్రసిద్ధిగాంచిన నీటి గుండం ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తారు. తాండూర్ ప్రాంత ప్రజలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి పెద్దసంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. అదేవిధంగా పట్టణంలోని భద్రేశ్వర స్వామి దేవాలయం, కోటేశ్వర స్వామి దేవాలయం, రాజీవ్ కాలనీ సమీపంలో ఇప్పల పరమేశ్వర దేవాలయం, హరిహర టౌన్షిప్ లోని శివాలయంలో భక్తులు శివనామ స్మరణ చేస్తూ, శివయ్యస్వామిని నందిని దర్శించుకున్నారు.

# గిరిజనులకు మార్గదర్శి సంత్ సేవాలాల్



కాప్రాలో..



తాండూరులో..



రంగారెడ్డిలో..

**ముద్ర, కాప్రా :**
సంత్ సేవాలాల్ మహారాజ్ కేవలం గిరిజనుల ఆరాధ్య దైవం మాత్రమే కాదని, అందరికీ ఆరాధ్యుడేనని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్పేట్ హెచ్బీ కాలనీ డివిజన్ కైలాసగిరి బంజారా భవన్లో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గిరిజనులకు దశదిశను చూపి, హైందవ ధర్మం గొప్పదనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని చరిత్రకారులు చెబుతారని తెలిపారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారని, దీంతో శ్రీ సంత్ సేవాలాల్ ఇతర కులాల వారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శ్రీనివాసులు రెడ్డి, ప్రభుదాస్ స్థానిక నాయకులు వంజరి ప్రవీణ్ రామక్రిష్ణ, సామ్ సన్, భూలక్ష్మీ, బంజారా యువతీ యువకులు పాల్గొన్నారు.

**తాండూర్ లో..**
తాండూర్ : వికారాబాద్ జిల్లా తాండూర్లో సంత్ సేవాలాల్ మహారాజ్ 278వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్ నాయక్ పాల్గొని మాట్లాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ పుణ్యఫలితంగానే బంజారాలకు సమాజంలో గుర్తింపు లభించిందని, బంజారా సమాజం కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేసి, బంజారాలను తన మంచి మాటలతో వారిలో చైతన్యం తీసుకొచ్చారని, అందుకే ఆయనను బంజారాల ఆరాధ్య దైవంగా భావిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ నెంబర్ వెంకట్ రాములు, నూతన మున్సిపల్ కౌన్సిలర్ సురేష్‌నాయక్, అనిల్ రాథోడ్, గోపాల్, వివిధ గ్రామాల బంజారా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరిలో..**
మల్కాజిగిరి : లంబాడీల హక్కుల కోసం పోరాడిన సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఆదివారం రామాంజనేయ నగర్లో ఘనంగా జరిగాయి. రాజు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ పాల్గొని సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లంబాడి కుటుంబ సభ్యులతోపాటు బిఆర్ఎస్ నాయకులు బైరు అనిల్, నగేష్ గౌడ్, వాసు, శెంకర్, లక్ష్మణ్ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఉమ్మడి రంగారెడ్డిలో..**
రంగారెడ్డి : సంత్ సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శనీయమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ఉపగడ్డ తండాలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల్లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. గిరిజనులకు ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి తనయుడు కౌశిక్ రెడ్డి , స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బంజారా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**కేపీహెచ్‌బీలో..**
హైదరాబాద్(కూకట్‌పల్లి): కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజనుల ఐక్యత, అభివృద్ధి కోసం సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి చిరస్మరణీయమని బండి రమేష్ కొనియాడారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ ఉత్సవాలను ఘనంగా



మల్కాజ్ గిరిలో..

నిర్వహించిన శేరి సతీష్ రెడ్డిని బండి రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సేవాలాల్ మహారాజ్ భక్తులు మరియు గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 16-02-2026
www.mudranews.in | @mudranews



టాప్ 10 భారత్-పాక్ మ్యాచ్ లు
2003 వరల్డ్ కప్ (సెంచూరియన్)



సచిన్ టెండూల్కర్ 98 పరుగుల ఇన్నింగ్స్ తో షోయబ్ అక్తర్ ను బలంగా ఎదుర్కొన్నాడు. భారత్ భారీ లక్ష్యాన్ని సులభంగా ఛేధించింది.

# భైంసా, ఖానాపూర్ లలో కిస్సా కుర్సీకా..!

- భైంసాలో చైర్మన్ పదవి కోసం మెలిక
- ఖానాపూర్ లో పట్టు వీడని పార్టీలు







**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లా భైంసా, ఖానాపూర్ పురపాలక సంఘాల్లో కిస్సా కుర్సీకా పోటీ మొదలైంది. మ్యాజిక్ ఫిగర్ చేరేందుకు కావలసిన ఇద్దరు ఇండిపెండెంట్ లో ఎవరో ఒకరికి చైర్మన్ పదవి ఇస్తేనే మద్దతు ఇస్తామని ప్రకటించారు. తమ సతీమణి ఖుతేజా సిద్ధికా ను తొలి సగం పదవీ కాలానికి చైర్మన్ చేస్తేనే మద్దతు ఇస్తామని ఆమె భర్త ఇద్రీస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భైంసాలో ఎంఐఎం 12 స్థానాలు సాధించగా, బీజేపీ 6, ఇండిపెండెంట్లు 5 మంది కలిసి వారికి బలం 11కు చేరుతుంది. ఎలా చూసినా పదవికి అవసరమైన 14 స్థానాలు ఏ పార్టీకి లేవు. ఈ నేపథ్యంలో 24, 25 వార్డుల కౌన్సిలర్లు ఫర్హానా బేగం, ఖుతేజా సిద్దిఖాలలో ఎవరో ఒకరికి తొలి సగం పదవీ కాలానికి చైర్మన్ చేయాలని మెలిక పెట్టారు. ఒక వర్గం వారు రెండో సగం ఇస్తామన్నా తాము అంగీకరించబోమని తేల్చి చెప్పారు. కాగా బీజేపీ, ఎంఐఎంలు వైస్ చైర్మన్ పదవి కట్టబెట్టేందుకు ప్రయత్నించినా వారు అంగీకరించలేదు.

ఈ నేపథ్యంలో ఎక్స్ ఆఫీషియో సభ్యునిగా ఎంపీ గోడం నగేష్ ఓటు తొలుత ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో నమోదు కాగా, హడావుడిగా దాన్ని భైంసాకు మార్చినట్లు తెలుస్తోంది.

**ఖానాపూర్ లో..**

రోజు రోజుకు క్యాంప్ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఖానాపూర్ మున్సిపల్ లో మొత్తం 12 వార్డుల్లో 4 బీజేపీ, మరో 4 వార్డులు బిఆర్ఎస్ కైవసం చేసుకున్నాయి. మిగతా 3 వార్డులలో కాంగ్రెస్, ఇండిపెండెంట్ 1 వార్డులో గెలుపొందారు. దీంతో ఖానాపూర్ బల్దియాపై కాంగ్రెస్ పార్టీ జండా ఎగురవేసేందుకు ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు యత్నాలు చేస్తున్నారు. బిఆర్ఎస్, బీజేపీల నుండి అభ్యర్థులను కొనుగోలు చేసేందుకు రాయబారాలు కొనసాగాయి. ఐతే తమ పార్టీ వారికే చైర్మన్ పదవి కట్టబెట్టాలని రెండు పార్టీలు పట్టుబట్టడంతో ప్రతిష్టంభన నెలకొంది. ఎలాగైనా మ్యాజిక్ ఫిగర్ చేరాలని ఎమ్మెల్యే బొజ్జు శతవిధాలా యత్నిస్తున్నారు.

# చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తా..

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ముద్ర, కరీంనగర్:**

చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం కొండన్నపల్లి సహస్ర లింగేశ్వర ఆలయంలో ఆదివారం నిర్వహించిన మహాశివరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాశివుని ఆశీర్వాదంతో చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమళ్ళ మనోహర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ వెలిచాల తిరుమలరావు, సర్పంచులు రేండ్ల జమున శ్రీనివాస్, ముద్దం నగేష్, వేముల భాస్కర్, బీర్ల ఆనందం, కడారి రేణుక కనకయ్య, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, రామిడి రాజిరెడ్డి, చిందం ఆంజనేయులు, నాయకులు సాగి అజయ్ రావు, బైరిశెట్టి సంపత్, వేముల అంజి, పెంచాల చందు, తూము రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి పర్వదినం..

# శివాలయాలకు నిరంతర విద్యుత్ సరఫరా..

## కరీంనగర్ సర్కిల్ ఇన్‌చార్జి ఎస్ఈ వీ గంగాధర్



**ముద్ర, కరీంనగర్:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని శివాలయాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని కరీంనగర్ సర్కిల్ ఇన్ చార్జి ఎస్ఈ వీ గంగాధర్ తెలిపారు. జిల్లాలోని పలు శివాలయాలకు సరఫరా అవుతున్న విద్యుత్ ను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు విద్యుత్ ఇబ్బంది పడకుండా అంతరాయం లేకుండా విద్యుత సరఫరా చేసేందుకు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ముందస్తుగా లోడ్ అంచనాకు అనుగుణంగా ట్రాన్స్‌పార్మర్ల సామర్థ్యం పెంచామని, విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలకుండా కొమ్మలను కట్ చేశామని, విద్యుత్ లైన్లు తగలకుండా స్పేసర్స్ పెట్టామన్నారు. 24 గంటలు పర్యవేక్షణ చేసేలా అదనపు సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ డీఈ రాజం, ఏఈ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# సూది మొనపై శివలింగం..

**ముద్ర, జగిత్యాల:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లాకు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత డాక్టర్ గుర్రం దయాకర్ మరో అద్భుతాన్ని ఆవిష్కరించారు. ఆయన సూక్ష్మ కళాఖండాన్ని రూపొందించి మహేశ్వరుడిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. 10 గంటల పాటు శ్రమించి సూది మొనపై శివయ్య విగ్రహాన్ని అత్యద్భుతంగా రూపొందించారు. నాగుపాము పడగ నీడలో శివయ్య కూర్చుని భక్తులను ఆశీర్వదిస్తున్నట్లుగా ఉన్న ఈ విగ్రహం చూసేవారిని ఆకట్టుకుంటోంది. ఈ విగ్రహం తయారీకి నైలాన్, పెన్సిల్ రంగులను ఉపయోగించానని, ఈ అద్భుత విగ్రహం పూర్తి చేయడానికి సుమారు 10 గంటల సమయం పట్టిందని ఆయన తెలిపారు. శివయ్యపై తన భక్తిని ప్రత్యేకంగా చాటుకున్న ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.





# మానవత్వం చాటిన చిన్నారి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



పక్కవాడికి సాయం చేయని పరిస్థితుల్లో, వయసు చిన్నదైనా తన ఉదారతను చాటుకున్న చిన్నారి నూనెల సాయి సహస్ర ఆదర్శంగా నిలుస్తోంది. నిర్మల్ మండలం రత్నాపూర్ కాండ్లీ బస్సు షెల్టర్ లో గత పది సంవత్సరాలుగా నిరుపేద వృద్ధురాలు ఎల్లమ్మ (70) తన ఏడేళ్ల మనవడితో కలిసి జీవిస్తోంది. కొడుకు, కోడలు మరణించడంతో ఏడేళ్ల మనవడు ఛత్రపతి బాధ్యత కూడా తానే స్వీకరించింది. పని చేయలేని వయసైనా మన వడిని పోషించేందుకు శాయశక్తులా కష్టపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న సాయి సహస్ర తన తల్లిదండ్రులతో చర్చించి 20 కేజీల సన్న బియ్యం, నిత్యావసర వస్తువులు, పండ్లు, బాబుకు రెండు జతల డ్రెస్సులు తీసుకెళ్లి ఆదివారం అందించింది. ఈ సందర్భంగా సాయి సహస్ర మాట్లాడుతూ వారిని ప్రభుత్వం గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించాలని కోరింది.

# వేలాల జాతరలో గుండెపోటుతో వ్యక్తి మృతి

**ముద్ర, మంచిర్యాల:**

వేలాల జాతరలో గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మహా శివరాత్రి సందర్భంగా మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల గట్టు మల్లన్న జాతరలో నస్పూర్ కాలనీకి చెందిన బింగి రాజేందర్ 45 సంవత్సరాల అనే వ్యక్తి గట్టు మల్లన్న స్వామిని దర్శించుకోవడానికి గుట్ట పైకి ఎక్కుతుండగా.. గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. గట్టు మల్లన్న స్వామిని దర్శించుకోవడానికి వచ్చి మృతి చెందడంతో కుటుంబీకులు బోరున విలపించారు. కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**ముద్ర, మంచిర్యాల:**



మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం శ్రీపతి నగర్ కు చెందిన తుమ్మ సదానందం(సాధు) అనే సింగరేణి ఉద్యోగి ఇల్లు షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. ఆదివారం సదానందం రోజువారీ డ్యూటీకి వెళ్లడంతో ఇంట్లో ఆయన తల్లి, భార్య మాత్రమే ఉన్నారు. తల్లి ఇంటి వెనుక నిద్రిస్తుండగా సదానందం భార్య స్నానానికి వెళ్ళింది. ఈ క్రమంలో ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని విలువైన వస్తువులతో పాటు నగదు, బంగారం, టేకు కర్ర కాలిపోయింది. సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఇంటి యజమాని సదానందం తెలిపారు.

# వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

- వేములవాడ ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం - వేలాలలో స్వామిని దర్శించుకున్న మంత్రి వివేక్



వేములవాడలో



వేలాలలో

**ముద్ర, కరీంనగర్:**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం మహా శివరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేములవాడ, కాళేశ్వరం, కోటిలింగాల తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాల వద్దకు చేరుకొని పూజలు చేస్తున్నారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి జాతర వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం వేకువజామున నుండే భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. మరోవైపు వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో బేబీ ఫీడింగ్ కేంద్రంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చికిత్స కేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం 60 వీల్ చైర్లు అందుబాటులో ఉంచారు. పట్టణ పరిధిలో 7 చోట్ల సమాచార కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయం మూసివేసి ఉండ డంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకొని కొబ్బరికాయలు కొట్టి స్వామివారిని బయట నుండే మొక్కి వెనుతిరుగుతున్నారు.

కాళేశ్వరం, కోటిలింగాలలో మహాశివరాత్రి వేడుకలు కొనసాగుతున్నాయి. ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. వేములవాడ, కాళేశ్వరం, కోటిలింగాల ఆలయాల వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. నిజామాబాద్, ఆర్మూర్, ఆదిలాబాద్, మెట్‌పల్లి, కోరుట్ల, భీంగల్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు వస్త న్నారు.

### కరీంనగర్ లో శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. నగరంలోని పాత బజార్ పురాతన గౌరీ శంకరాలయానికి వేకువజామున నుంచే భక్తులు బారులు తీరారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య భక్తులను క్రమబద్ధతిలో దర్శనాలు చేసుకునేలా అభిషేకాలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. కమాన్ రోడ్డు రామేశ్వరాలయం, భగత్ నగర్ భవానీ శంకరాలయం, హరిహర క్షేత్ర శివాలయం, ఆదర్శనగర్ రాజరాజేశ్వర స్వామి ఆలయం తదితర నగర శివారులోని శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

### వేలాలలో స్వామిని దర్శించుకున్న మంత్రి వివేక్

**ముద్ర, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన వేలాల గట్టు మల్లన్న స్వామిని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆయన సతీమణి సరోజ దర్శించుకున్నారు. తొలుత మంత్రికి ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఒగ్గు పూజారుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి మంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం మూడు రోజుల జాతర ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అధి కారులకు పలు సూచనలు చేశారు.



కాళేశ్వరంలో



కరీంనగర్ లో

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
16.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 భారత్-పాక్ మ్యాచ్ లు**



2011 వరల్డ్ కప్ (మొహాలి సెమీఫైనల్)
సచిన్ కీలక ఇన్నింగ్స్, బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో భారత్ ఫైనల్ చేరింది. ఈ మ్యాచ్‌కు భారీ రాజకీయ, భావోద్వేగ ప్రాధాన్యం ఉంది.

# తీర్థలలో ట్రాఫిక్ కష్టాలు

- చేతులెత్తేసిన అధికారలు
- పట్టించుకోని పాలకులు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఖమ్మం రూరల్ మండలం తీర్థలలో మూడు రోజుల పాటు జరిగే జాతరకు మొదటి రోజు జనం పోటెత్తారు. భక్తుల రద్దీతో రోడ్లన్నీ కిక్కిరిసి పోయాయి. ప్రజా ప్రతినిధులకు పోలీసు అధికారులకు ముందస్తు అవగాహన లేకపోవడం అందుకు అవసరమైన పోలీస్ యంత్రాంగాన్ని ట్రాఫిక్ నియంత్రణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. మధ్యాహ్నం ఎర్రటి ఎండలో దాదాపు గంటన్నర పాటు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకొని ఎండ తీవ్రతకుపలువురు మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పల్లెగూడెం నుంచి తీర్థాల జాతర వరకు రోడ్డు మధ్యలో 60 ఎం ఎం కంకర, గ్రావెల్ మట్టి తోలి ఉంచడంతో వాహనాల రాకపోకలకు పెద్ద ఎత్తున దుమ్ము ధూళి లేచి ఎదుటి గా వచ్చే వాహనాలు కనిపించని దుస్థితి ఏర్పడింది. పలు ద్విచక్ర వాహనదారులు వారి కుటుంబ సభ్యులతో వెళుతున్న క్రమంలో కంకర రాళ్లు బెసికి కింద పడిపోతున్నారంటే ఈ రహదారులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. బ్రిడ్జి కింద గ్రావెల్ తో రోడ్డు మార్గాన్ని వన్ వే రూట్ గా తయారు చేసిన కూడా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో వాహనదారులను నియంత్రించడంలో పోలీసులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారు. దుమ్ము ధూళే లేవకుండా కనీసం రోడ్డుపైన ట్యాంకర్లతో నీళ్లు చల్లే సరైన ప్రజాప్రతినిధి లేకపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారి ఇబ్బందులను పరిగణంలోకి తీసుకోలేకపోవడం విమర్శలకు తావిచ్చాయి.





## నేడు కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం

- ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు సోమవారం ఉదయం 11.00 గంటలకు భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి వాతావరణంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, కౌన్సిలర్ల కు ప్రమాణ స్వీకారం మున్సిపల్ ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను తప్ప కుండా పాటించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమీషనర్ కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామలింగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ గా స్వప్న?

- వైస్ చైర్మన్ గా పల్లెర్ల వెంకన్న
- నేడు గెలుపొందిన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం

**ముద్ర, మోత్కూర్:**



మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ గా 6వ వార్డు కౌన్సిలర్ గడ్డం స్వప్న, వైస్ చైర్మన్ గా 1వ వార్డు కౌన్సిలర్ పల్లెర్ల వెంకన్న ఖరారైనట్టు సమాచారం. మోత్కూర్ మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డులకు గాను కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 3, ఒక వార్డు లో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. కాంగ్రెస్ గెలిచిన 1, 2, 6, 7, 8, 9, 11, 12వ వార్డుల కౌన్సిలర్లు క్యాంపులో ఉన్నారు. చైర్మన్ పదవి ఎస్సి మహిళకు రిజర్వ్ కావడంతో ఎస్సి స్థానం 6వ వార్డు నుంచి గెలిచిన గడ్డం స్వప్న సోమనర్సయ్య, జనరల్ స్థానం నుంచి గెలిచిన మెంట రమణ నగేష్ తీవ్రంగా పోటీ పడ్డారు. వైస్ చైర్మన్ కోసం 1వ వార్డు నుంచి గెలిచిన పల్లెర్ల వెంకన్న, 9వ వార్డు నుంచి గెలిచిన బీసు శ్రీకాంత్ తీవ్రంగా పోటీ పడ్డారు. చైర్మన్ ఎంపిక విషయంలో ఎమ్మెల్యే సామేల్ గడ్డం స్వప్నకే ఇవ్వాలని పట్టుబట్టి కూర్చునట్టు తెలిసింది. ఎంపీ చామల అనుచరుడైన 9వ వార్డు కౌన్సిలర్ బీసు శ్రీకాంత్ కు వైస్ చైర్మన్ ఇవ్వాలని ఎంపీ వర్గం కోరగా..ఇస్తే పల్లెర్ల వెంకన్నకు ఇవ్వాలని, లేని పక్షంలో కారుపోతుల వెంకన్నకు ఇవ్వాలని చర్చించినట్టు తెలిసింది. చర్చలు, బుజ్జగింపులతో ఎట్టకేలకు చైర్మన్ గా గడ్డం స్వప్న సోమనర్సయ్య, వైస్ చైర్మన్ గా పల్లెర్ల వెంకన్న లను ఖరారు చేసినట్టు సమాచారం.



## టెంటు సామాగ్రి పంపిణీ

**ముద్ర,ఆత్మకూర్ (ఎం):**

మండలంలోని సింగారం గ్రామంలో ఎస్సీ కాలనీ వాసులకు స్థానిక టిఆర్ఎస్ నాయకులు సప్పిడి ఝాన్సీ పురుషోత్తం రెడ్డి టెంటు సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎస్సీ కాలనీవాసులు శుభకార్యాలు నిర్వహించుకోవడానికి రూపాయలు రెండు లక్షలు విలువ చేసే టెంట్ తోపాటు వంట సామాగ్రిని, ఇతర సామాగ్రిని ఉచితంగా అందించడం జరిగిందని ఆమె తెలిపారు .ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులు ఝాన్సీ దంపతులను శాలువతో సత్కరించారు. అనంతరం కాలనీలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు వల్లాల రాములు , శ్రీహరి ,వెంకట్ రెడ్డి, చంద్రయ్య, శ్రీరాములు, సిద్ధులు, పాల సంఘం చైర్మన్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధర్మ భిక్షం జయంతి

**ముద్ర, ఆత్మకూర్ (ఎం):**

పార్లమెంట్ మాజీ సభ్యులు, కమ్యూనిస్టు నేత, కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం గౌడ్ 104వ జయంతిని ఆత్మకూరు మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి వద్దగల ధర్మ భిక్షం విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ధర్మ భిక్షం తెలంగాణ సాయుధ పోరాటంలో పేద ప్రజల విముక్తి కోసం అహర్నిశలు కృషి చేసి విముక్తి కలిగించారని వారు కొనియాడారు .గీసే వాడిదే చెట్టు అనే నినాదంతో గీత కార్మికుల కోసం అనేక ఉద్యమాలు చేపట్టి సఫలీకృతులయ్యారని వారు తెలిపారు. గీత కార్మికులకు అనేక హక్కులను సాధించి పెట్టిన ఘనత ధర్మ బిక్షంకే దక్కుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బీసు చందర్ గౌడ్ ,ఘనగాని మల్లేష్ గౌడ్, స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి, గుండె గాని ఐలయ్య, నాతి రాజు, రంగా సత్యనారాయణ, లోడి శ్రీను, పొన్నగాని జహంగీర్, బొడిగ వెంకన్న ,పోతగాని మల్లేష్ రంగస్వామి, పంజాల కృష్ణమూర్తి, మాధ సత్తయ్య, చెరుకు శ్రీనివాస్, బబ్బురి శివలింగం, రంగ శ్రీను, చెరుకు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.



## శివయ్యను దర్శించుకున్న బీఆర్ఎస్ నేతలు

**ముద్ర, ఖమ్మం:**



మహాశివరాత్రి సందర్భంగా ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కూసుమంచి లోని రామలింగేశ్వర స్వామి ఆలయం, తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని, ఖమ్మం లోని గుంటు మల్లేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు వారిని ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూలమాలలు సమర్పించి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, నాయకులు ముత్యాల వెంకట అప్పారావు, బాలు నాయక్, కూసుమంచి, తీర్థాల సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మోగుళ్ల అనురాధ శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక

**ముద్ర, మోత్కూర్:**

మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని భుజిలపురం 5వ వార్డు ఇండిపెండెంట్ గా గెలిసిన అభ్యర్థి మొగుళ్ళ అనురాధ శ్రీనివాస్ రెడ్డి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వీరితోపాటు బిఆర్ఎస్ పార్టీ మోత్కూర్ మున్సిపాలిటీ సీనియర్ నాయకులు చుక్క వెంకన్న పార్టీలోకి చేరడం జరిగింది వీరి వెంట కాంగ్రెస్ నాయకులు Dr లక్ష్మీ నరసింహారెడ్డి,చింతల రాజిరెడ్డి ,చింతల సందీప్ రెడ్డి, మహమ్మద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ భిక్షం ఆశయాలు సాధించాలి

**ముద్ర, మోత్కూరు:**

పేదల కోసం నిరంతరం కృషి చేసిన మాజీ పార్లమెంటు సభ్యుడు బొమ్మగాని ధర్మ భిక్షం గౌడ్ సేవలు చిరస్మరణీయమని గీత పని వారాల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య అన్నారు. ఆదివారం మోత్కూరు మున్సిపల్ పరిధిలోని గౌడ సంఘం లో ధర్మ భిక్షం గౌడ్ 104,వ జయంతి సందర్భంగా గీతా పనివారల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం గల్లి నుంచి ఢిల్లీ వరకు ధర్మ భిక్షం అనేక పోరాటం నిర్వహించారని, గీత కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటం నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతా పనివారాల సంఘం మండల అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, గీత సొసైటీ అధ్యక్షులు బీసు సత్తయ్య గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, వివిధ సంఘాల నాయకులు బైరు లింగయ్య, ఎడ్ల పురుషోత్తం గంగాదేవి చంద్రయ్య, గొలుసుల యాదగిరి, తాడూరి లక్ష్మీ నర్సయ్య, ఎడ్ల రాము నిలిగొండ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.





## గుంటు మల్లేశ్వరుని దర్శించుకున్న తుమ్మల యుగంధర్

**ముద్ర, ఖమ్మం:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం యుగంధర్ మాట్లాడుతూ.. మహాశివరాత్రి పర్వదినాన రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో, సుఖ శాంతులతో విరాజిల్లాలని అంతే కాకుండా తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ పరమశివుడిని వేడుకున్నానని తెలిపారు.

## రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి

- శివరాత్రి సందర్భంగా మంత్రి పొంగులేటి దంపతుల ప్రత్యేక పూజలు

**ముద్ర, ఖమ్మం:**



మహాశివరాత్రి పర్వదినం వేళ ముక్కంటి చెంత భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాధురి దంపతులు తమ ముద్దుల మనుమరాలు మైరాతో కలిసి ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలను సందర్శించారు. ఆయా ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించారు. ఖమ్మం రూరల్ మండలం తీర్థాల శ్రీ సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకున్న తరువాత చారిత్రక ప్రసిద్ధి గాంచిన కూసుమంచి శ్రీ గణపేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం బెండాలపాడులోని పల్లెర్లబావి శ్రీ వీరభద్రస్వామి వారిని మంత్రి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. "మహాశివరాత్రి పర్వదినాన రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో విరాజిల్లాలని, తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ పరమశివుడిని వేడుకున్నాను" అని తెలిపారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**





మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలో అన్ని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుండి భక్తులు శివాలయాలకు చేరుకొని దర్శనం చేసుకున్నారు. భువనగిరి లోని శ్రీ పచ్చల కట్ట సోమేశ్వర ఆలయంలో జరిగిన శివపార్వతిల కళ్యాణంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ దక్షిణేశ్వర స్వామి ఆలయం, శ్రీ అమృత లింగేశ్వరాలయం, మాస్ కుంట శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాలలో శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలలో ఆయా దేవస్థానాల కమిటీ సభ్యులు అధ్యక్షులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
16.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 భారత్-పాక్ మ్యాచ్ లు**

2015 వరల్డ్ కప్ (అడిలైడ్) విరాట్ కోహ్లీ సెంచరీతో భారత్ పాక్‌పై మరోసారి ఆధిపత్యం చూపించింది. పాక్ వరల్డ్ కప్‌లో భారత్‌పై గెలవలేకపోయింది.





# భక్తులకు అన్ని వసతులు కల్పించాం

- **కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఏడుపాయల అభివృద్ధి**
- **ఎమ్మెల్యే డా.రోహిత్ రావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఏడుపాయల జాతరకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. ఆదివారం మహా శివరాత్రి సందర్భంగా దుర్గామాతకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడుపాయలను అభివృద్ధి చేసేందుకుగాను సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారని తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు జరుగుతున్న జాతరకు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారన్నారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు సేవలందించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్, ఆలయ ఈఓ వీరేశం, డీసీసీ అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంతప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు భరత్ గౌడ్, ఆలయ సిబ్బంది, ఆలయ పూజారులు, పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# అంతర్జాతీయ హక్కుల కమిషన్ జిల్లా కార్యవర్గ నియామకం

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి :**

అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా ముహమ్మద్ ఫరీదుద్దీన్, ఉపాధ్యక్షుడిగా అన్వర్ పాషా నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు అఫ్జాద్ ఖాన్ నియామక పత్రం అందజేశారు. అనంతరం సిద్దిపేట జిల్లా నూతన కమిటీ ని ఏర్పాటు చేశారు. సైపుద్దీన్ జమీల్, యూనస్, పాషా ముహమ్మద్, ఫరూక్, రాములు, అమీర్, శ్రీనివాస్, ముజాహిద్ గణేష్ తదితరులను సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా ముహమ్మద్ ఫరీదుద్దీన్ మాట్లాడుతూ చట్టపరమైన, సామాజిక, ఇతర సంఘర్షణల వల్ల ప్రభావితమైన వారికి అన్ని స్థాయిల్లో మార్గదర్శకత్వం, నాయకత్వం అందించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. మతం, కులంతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి హక్కులను సాధించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.



# చైర్ పర్సన్ ఎన్నిక కోసం ఏర్పాట్లు

- **పరిశీలించిన అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఏర్పాట్ల గురించి ఆదివారం అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు అవసరమైన భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నిక కేంద్రం పరిసరాల్లో అనవసర గుంపులు చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ సక్రమంగా నిర్వహించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమస్యాత్మక పరిస్థితులు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి వెంట జెడ్పీ సీఈఓ, రిటర్నింగ్ అధికారి ఎల్లయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ టౌన్ సీఐ మహేష్, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.



# మెదక్ పీఠం ఎవరిదో...?

- **వీడని ఉత్కంఠ..**
- **కీలకంగా మారిన బీజేపీ**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**




మెదక్ పురపాలక సంఘం చైర్మన్ ఎవరు అనేది ఇంకా స్పష్టత రావడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కు స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో బీజేపీ కీలకంగా మారింది. ఎక్కడికెళ్లిన ఇదే చర్చ సాగుతోంది. చైర్మన్ పదవి ఏ పార్టీకి దక్కించుకుంటుందనేది అంతుచిక్కడం లేదు. మెదక్ చైర్మన్ ఎవరు అవుతారన్న ఉత్కంఠ నెలకొంది. మెదక్ లో మొత్తం 32 వార్డులుండగా కాంగ్రెస్ 14 గెలిచింది. బిఎస్పీ నుంచి గెలిచిన ఒకరు కాంగ్రెస్ లో కలవడంతో 15కు పెరిగింది. ఆలాగే ఎమ్మెల్యే ఎక్స్ ఆఫీషియో ఓటుతో కలిపి మొత్తం 16కు చేరింది. బీఆర్ఎస్ లో 15 మంది గెలిచారు. బీజేపీ 2 స్థానాలు గెలిచింది.

ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీ మద్దతు లేకుండా ఏ పార్టీకి అయినా చైర్మన్ కుర్చీ అందుకోవడం సులభం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే బీజేపీ ఏ పార్టీకి మద్దతు ఇస్తుందో అన్నదానిపై అందరి దృష్టి నిలిచింది.

ఇదిలా ఉండగా కాంగ్రెస్, బీజేపీ మధ్య సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నా, స్థానిక రాజకీయ పరిస్థితులు ఎప్పుడైనా మారవచ్చు. మెదక్ లో కూడా అనూహ్య మలుపులు తిరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మరోవైపు బీఆర్ఎస్ కూడా చైర్మన్ పదవిపై కన్నేసి మెజారిటీ సాధించేందుకు గట్టిగా ప్రయత్నాలు సాగిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎవరు ఎవరికి మద్దతు ఇస్తారు. ఎవరు చైర్మన్ కుర్చీని దక్కించుకుంటారో మరికొన్ని గంటల్లో సస్పెన్స్ కు తెర పడనుంది.

**బీజేపీ దూరంగా ఉంటే కాంగ్రెస్ కు లాభం..**

బీజేపీ నుంచి గెలుపొందిన ఇద్దరు సభ్యులు ప్రత్యేక సమావేశానికి దూరంగా ఉంటే పరోక్షంగా కాంగ్రెస్ కు లాభం అవుతుంది. ఓటింగ్ జరిగినా ఒక్క ఓటుతో పీఠం హస్తగతం చేసుకుంటుంది. ఈ దిశగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఎంపీ రఘునందన్ రావు నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఎంపీ రఘునందన్ రావు బీఆర్ఎస్ కు మద్దతు ఇవ్వవకపోవచ్చని ప్రచారం జరుగుతుంది. బీఆర్ఎస్ కు మద్దతిస్తే వైస్ చైర్మన్ ఇవ్వడానికి ముందుకొచ్చిందని అవసరమైతే చైర్మన్ పోస్ట్ బీజేపీకి ఇచ్చి, వైస్ చైర్మన్ తీసుకోవడానికి బీఆర్ఎస్ సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతుంది.

**నర్సాపూర్ లోనూ వీడని ఉత్కంఠ..**

నర్సాపూర్ మున్సిపాలిటీలో కూడా ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఎవరికీ ఎవరు మద్దతిచ్చుకుంటారు. ఎవరు చైర్మన్ పీఠం ఎక్కుతారనేది ఇంకా స్పష్టత రాలేదు. మూడు పార్టీల మధ్య చర్చలు సాగుతున్నట్లు తెలిసింది.

**రామాయంపేట లో కాంగ్రెస్, తుప్రాన్ లో బీఆర్ఎస్..**

రామాయంపేటలో చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకోనుంది. 12 స్థానాలుండగా 8 స్థానాలు గెలుపొందడంతో గజవాడ లావణ్య నాగరాజు చైర్ పర్సన్ కానున్నారు. వైస్ చైర్మన్ ఎవరినేది ఇంకా స్పష్టత రాలేదు.

తుప్రాన్ మున్సిపల్ పీఠం బీఆర్ఎస్ కైవసం చేసుకోనుంది. ఇక్కడ 15 స్థానాలుండగా బీఆర్ఎస్ 9 స్థానాలతో స్పష్టమైన మెజాటిటీ సాధించి పీఠం దక్కించుకోనుంది. మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్ సతీమణి చైర్ పర్సన్ అయ్యే అవకాశం ఉంది.

# వన దుర్గ సన్నిధిలో కలెక్టర్, ఎస్పీ దంపతుల పూజలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయలలో మహా శివరాత్రి సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్, శ్రీజ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహా జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని

ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలన్నారు. భక్తులందరూ మూడు రోజులు పాటు జరిగే జాతరలో ప్రశాంతంగా దర్శనాలు చేసుకొని తిరిగి వెళ్లాలన్నారు. అనంతరం ఉచిత మహిళా బస్సును కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. అదనపు కలెక్టర్ నగేష్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ కార్యనిర్వహణాధికారి వీరేశం తదితరులు ఉన్నారు.

ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు వన దుర్గ మాత ఆలయాన్ని కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు చేపట్టిన భద్రతా చర్యలపై ఎస్పీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూలైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. భక్తులు శాంతియుతంగా దర్శనం చేసుకోవాలని కోరారు.





# భక్తజన సంద్రంగా నవనాథ్ సిద్ధుల గుట్ట

**ముద్ర, హైదరాబాద్:**

ఆర్మూర్ పట్టణంలోని శ్రీ నవనాథ్ సిద్ధుల గుట్ట ఆదివారం మహా శివరాత్రి సందర్భంగా భక్తజనసంద్రంగా మారింది. శివనామ స్మరణలతో శివాలయం మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయంలో పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శివలింగానికి తమ మొక్కులను చెల్లించుకుంటున్నారు. ఆలయం పూజారి పంచామృత అభిషేకం తోపాటు ప్రత్యేక హారతి కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పూజారి తెలిపారు.

# అధిష్టానం నిర్ణయం మేరకే నడుచుకుంటాం

**ముద్ర, హైదరాబాద్:**

తమ అధిష్టానం నిర్ణయం మేరకే నడుచుకుంటామని కామారెడ్డి మున్సిపల్ లోని నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రకటించారు. తాము ఏ పార్టీలో చేరలేదని, బీఆర్ఎస్‌లోనే ఉన్నామని తెలిపారు. కొత మంది సోషల్ మీడియాలో తాము కాంగ్రెస్‌లో చేరినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఆ ప్రచారాలను నమ్మొద్దని ప్రకటించారు. ఈ మేరకు ఆ నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు (18 వ వార్డు కౌన్సిలర్ హఫీజ్ బేగ్, 45వ వార్డ్ కౌన్సిలర్ పిట్ల వేణుగోపాల్, 46వ వార్డ్ కౌన్సిలర్ గరిగంటి లక్ష్మీనారాయణ, 47వ వార్డ్ కౌన్సిలర్ గరిగంటి స్వప్న ఆదివారం వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము కాంగ్రెస్ పార్టీలో చేరలేమని బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నామని స్పష్టం చేశారు. తాము ఏ ప్రలోభాలకు లొంగలేదన్నారు. కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సారథ్యంలోని బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా కామ్రేడ్ ధర్మభిక్షం జయంతి

**ముద్ర, హైదరాబాద్:**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ ధర్మభిక్షం 104 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ గీత పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ ఆధ్వర్యంలో కోటగిరి సర్కార్ దావఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఠల్ గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల కోసం, గీత సొసైటీల ఏర్పాటు కోసం కృషి చేసిన మహానీయుడు కామ్రేడ్ ధర్మభిక్షం అన్నారు. గీత కార్మికుల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఆయన పోరాట ఫలితంగానే ఐదు ఎకరాలు భూమి, వన పెంపకం, పెన్షన్లు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజా గౌడ్ కృష్ణగౌడ్, వెంకా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మహా శివరాత్రి పురస్కరించుకొని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. మెదక్ పట్టణానికి సమీపంలో గల ముత్తాయికోట శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రధాన అర్చకులు గోవింద్ మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మెదక్ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ఉప వాస దీక్ష విరమించారు.

జక్కన్నపేట మల్లేశ్వర స్వామి, సర్ధన, ఔరంగాబాద్, రాజ్ పేట్, పెద్ద శంకరంపేట్ మండలం కొప్పోల్, చిన్న శంకరంపేట్ మండల కేంద్రంలో గల ప్రాచీనా సోమేశ్వరాలయం భక్తజన సంద్రంగా మారాయి. మెదక్ పట్టణంలో గల అనాది శివాలయం, చిదంబేశ్వరాలయంలో ఉదయం నుంచి భక్తులు అభిషేకాలు, పూజల్లో పాల్గొన్నారు.





# ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి :**

పట్టణంలోని మినీ స్టేడియంలో నెల రోజుల నుంచి జరుగుతున్న సాదత్ నజీర్ ఫ్రెండ్ షిప్ కప్ 2026 క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ముగిసింది. ప్లాటినం, గోల్డ్, సిల్వర్ కప్ లాంటి మూడు విభాగాల్లో మ్యాచ్ లు నిర్వహించారు.

సిద్దిపేట జిల్లా నుంచి 12 క్రికెట్ టీంలు పాల్గొన్నాయి. నెల రోజుల పాటు జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో పలువురు విజేతలుగా నిలువగా, మూడు ఫైనల్లు నిర్వహించారు. గోల్డ్ కప్ లో మూన్ స్టార్ గెలువగా, సిల్వర్ కప్ లో క్రికెట్ హాలిక్స్ గెలిచారు. ప్లాటినం కప్ ఫైనల్ కు ప్రైమ్ కేర్ హాస్పిటల్, అంజనీ 11 టీంలు చేరాయి.

ఈ సందర్భంగా ఆర్గనైజర్ జమ్మూ ఖాన్ మాట్లాడుతూ సిద్దిపేట ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాదత్ నజీర్ ఆధ్వర్యంలో సాదత్ నజీర్ ఫ్రెండ్ షిప్ కప్ 2026 నిర్వహించమన్నారు. సిద్దిపేట ఫౌండేషన్ ద్వారా కుల మతాలకు అతీతంగా సాదత్ నజీర్ అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారూ. చదువులో రానిస్తున్న వారికి స్కాలర్షిప్ లు, పేద యువతుల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం, పేద,ఒంటరి, విడోస్ మహిళలకు ప్రత్యేక పెన్షన్స్, పేదలకు హెల్త్ కేర్, లాంటి అనేక విభాగల్లో సేవలను అందిస్తున్నారని గుర్తు చేశారు. త్వరలోనే మరిన్ని సేవలు విస్తరించడానికి అయన ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. సిద్దిపేట నుంచి రంజిలకు ఎంపికైన ఆఫ్రాజ్, ఆఫ్రిది, అబ్రర్ లాంటి క్రీడాకారుల ప్రోత్సాహం కోసం సిద్దిపేట మినీ స్టేడియంలో టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. సిద్దిపేట క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు ప్రత్యేక శ్రద్ధతో రూపొందించిన క్రికెట్ స్టేడియం అద్భుతంగా ఉంద న్నారు. టోర్నమెంట్ విజయవంతం కోసం సహకరించిన మిగతా ఆర్గనైజర్లు అజర్, మెహెరాజ్, ఖాజలకు ధన్యవాదాలు

**టాప్ 10 భారత్-పాక్ మ్యాచ్ లు**

2019 వరల్డ్ కప్ (మాంచెస్టర్) రోహిత్ శర్మ శతకం, వర్షం కారణంగా DLS పద్ధతిలో భారత్ విజయం సాధించింది. వరల్డ్ కప్ రికార్డ్ 7-0కి చేరింది.





# వేములవాడలో మహాశివరాత్రి వైభవం

- భక్తిజనసంద్రంగా భీమేశ్వర క్షేత్రం

**వేములవాడ, ఫిబ్రవరి 15:**

పవిత్రమైన మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. హర హర మహాదేవ, ఓం నమశ్శివాయ నినాదాలతో ఆలయం మారుమోగగా, వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. రాత్రి నుంచే క్యూ లైన్లలో నిలబడి భక్తులు దర్శనం పొందారు. సుమారు లక్షల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులకు సౌకర్యాల కోసం జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్, ఎస్పీలు మహేష్ బి గీత, రమాదేవి తదితర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్య శిబిరాలు, సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి, క్యూ లైన్లను క్రమబద్ధీకరించారు. శివదీక్షాపరులు నిర్వహించిన పంచామృత శోభయాత్ర పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. డప్పులు, భజనలు, నృత్యాలతో సాగిన ఈ శోభయాత్ర భక్తి పరవశాన్ని మరింత పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శివార్చన వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఒగ్గుకథలు, శాస్త్రీయ నృత్యాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రంతా భక్తులు ఉపవాసం, జాగరణ చేస్తూ శివనామ స్మరణలో లీనమయ్యారు.విద్యుత్ దీపాలతో అలంకరించిన భీమేశ్వర ఆలయం అద్భుతంగా మెరిసి భక్తులకు కనువిందు చేసింది. మొత్తం మీద వేములవాడలో మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి.



# సిద్ధిపేట పరిసర ప్రాంతాల్లో పులి సంచారం

- సిద్ధిపేట పరిసర ప్రాంతాల్లో పులి సంచారం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సిద్దిపేట ఏసీపీ రవీందర్

**సిద్ధిపేట, ముద్ర ప్రతినిధి :**

సిద్ధిపేట సమీపంలో గల చిన్నకోడూరు మండలంలోని మాచపూర్ విఠలాపూర్ గ్రామాల మధ్య ఆదివారం ఉదయం 6 నుంచి 7 గంటల ప్రాంతంలో పులి సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు ధృవీకరించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే సిద్ధిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి స్థానిక చిన్నకోడూరు ఎస్ ఐ చంద్రమోహన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పులి సంచారం నేపథ్యంలో మాచపూర్, విఠలాపూర్, రంగయపల్లి, ఎల్లాయపల్లి గ్రామాల ప్రజలు, ముఖ్యంగా రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదన్నారు. అత్యవసరమైతే పగటిపూట కూడా కనీసం ముగ్గురు, నలుగురు కలిసి శబ్దం చేస్తూ లేదా పాటలు పాడుతూ వెళ్లడం శ్రేయస్కరమని తెలిపారు. పశువులను అడవి ప్రాంతానికి లేదా పులి సంచరించినట్లు భా



విస్తున్న పొలాల వైపు తోలుకెళ్లవద్దన్నారు. పులి అడుగుజాడలు గానీ లేదా పులి కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. స్వయంగా పట్టుకోవడానికి లేదా వేటాడటానికి ప్రయత్నించవద్దని తెలిపారు. ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.





# ఓం నమ:శివాయ

- తెలుగు రాష్ట్రాల్లో మార్మోగిన శివనామస్మరణ
- మహా శివరాత్రి వేళ భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

**ముద్ర, వేములవాడ:**

మహా శివరాత్రి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో భక్తి పారవశ్యం తారాస్థాయికి చేరింది. "ఓం నమఃశివాయ" నినాదాలతో ఆలయాలు మార్మోగగా, శివయ్య అనుగ్రహం కోసం భక్తులు రాత్రంతా జాగరణలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రముఖ శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చి పరమశివుని దర్శించుకున్నారు. తెలంగాణలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకలతో కళకళలాడింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనుబంధ



భీమేశ్వరస్వామి ఆలయానికి కూడా భారీగా రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం తరఫున భీమేశ్వరస్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

### కాళేశ్వరంలో వైభవంగా ముక్తేశ్వర శుభానంద కల్యాణం

### త్రివేణి సంగమంలో హంసవాహన సేవ

**మహాదేవపూర్, ముద్ర:** యమధర్మరాజు పేరున వెలసిన కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో శివరాత్రి పర్వదినాన ముక్తేశ్వర సుభానంద దేవిల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. లింగ రూపంలో కాళేశ్వరుడు ముక్తేశ్వరుడు ఒకే పానవట్టముపై జోడు లింగాలుగా దర్శనమిస్తారు. కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయం భక్తుల శివ నామస్మరణతో మారుమోగింది. రాష్ట్రం నలుమూలల నుంచి మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుంచి లక్షమందికి పైగా భక్తులు తరలి వచ్చారు. త్రివేణి సంఘమం స్నాన ఘట్టాలు భక్తజన సందోహంతో నిండిపోయాయి. గోదావరి నదీ జలాలతో ఆలయం వద్ద క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు కాళేశ్వర ముక్తేశ్వర స్వామివార్లను అభిషేకించారు. అనంతరం అనుబంధ ఆలయాలను దర్శించుకున్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, కాళేశ్వరం, మహాదేవపూర్ సర్పంచ్ లు వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి, హసీనా భాను, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం స్వామివారికి త్రివేణి సంగమములో హంస వాహనసేవను నిర్వహించారు.





# వైభవంగా ఏడుపాయల జాతర

- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే రోహిత్ దంపతులు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లా పాపన్న పేట మండల పరిధిలోని ఏడుపాయలలో మహా శివరాత్రి జాతర వైభవంగా ప్రారంభమైంది. రాతి గుహలో కొలువైన వన దుర్గా మాతకు తెల్లవారు జామున పూజారులు అభిషేకం నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని పట్టు చీర, బంగారు కిరీటం, పసిడి హారాలు, ముక్కుపుడక, వెండి కన్నులు, గజమాల, నిమ్మకాయల దండలతో విశేష అలంకరణ చేశారు. అర్చనల అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ప్రభుత్వం తరపున మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, శివాని దంపతులు అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంజీరా నది పాయ మధ్యలో కొలువుదీరిన మహా శివుడికి పూజలు చేశారు.

**ఉదయం నుంచే భక్తుల రాక..**

ఏడుపాయలకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. రాష్ట్రంలోని హైదరాబాద్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలతో పాటు కర్ణాటక బీదర్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చి మంజీరా నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ శాఖలు సౌకర్యాలు కల్పించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. అదనపు కలెక్టర్ నగేష్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎస్పీ డీవీ





శ్రీనివాస్ రావు, అదనపు ఎస్పీ మహేందర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

**నేడు బండ్ల ప్రదర్శన..**

ఏడుపాయల జాతరలో ప్రధాన ఘట్టం ఎడ్ల బండ్ల ప్రదర్శన సోమవారం జరుగనుంది. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
16.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



2023 వరల్డ్ కప్ (అహ్మదాబాద్)
భారత్ బౌలర్లు పాక్‌ను కేవలం 191కి ఆపారు. రోహిత్ శర్మ అద్భుత బ్యాటింగ్‌తో సులభ విజయం.



# చైర్మన్ పీఠంపై వీడని పీఠముడి

- **ఎవరికి వారు తీవ్ర ప్రయత్నం**
- **క్యాంపులో ఉంటూనే పైరవీలు**

**ముద్ర, వనపర్తి :**

వనపర్తి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సోమవారం జరగనుండగా ఇప్పటికీ అభ్యర్థి ఎవరన్నా పీఠముడి వీడలేదు. ఎవరికివారు లాభం చేస్తారన్న ఉద్దేశంతో అధికార పార్టీ అధినేతలు క్యాంపు నిర్వహిస్తున్నప్పటికీ, క్యాంపులో నుండే పైరవీలు మొదలుపెట్టారు. మొదటి నుండి వైశ్యుడైన ఎస్ఎల్ఎన్ రమేష్‌సతీమణి మాధవికి ఎమ్మెల్యే మాట ఇచ్చారన్న టాక్ వినిపించినప్పటికీ, ఎన్నిక ముందు ఒక లెక్క.. తర్వాత మరో లెక్క అన్న చందంగా గెలుపొందిన అభ్యర్థులు తమకే కావాలంటూ క్యాంపు లోనే పట్టుబడుతున్నట్లు తెలుస్తుంది. బీసీ వర్గానికి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు తమకే కావాలని బీసీ వర్గానికి చెందిన కౌన్సిలర్లు అధికంగా ఉన్నారని పట్టుబడుతున్నట్లు తెలుస్తుంది. వనపర్తి మున్సిపల్ చైర్మన్ పీఠం గతంలో ఎప్పుడు ఉన్నత వర్గాలకు ఇవ్వలేదని ఈసారి మాట ఇచ్చినందున మాధవికే మద్దతు తెలిపాలని ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చెప్పినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా మరో మహిళా కౌన్సిలర్ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షున్ని ఎంపీని ఇతర మంత్రులను మచ్చిక చేసుకొని చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కౌన్సిలర్ల కప్పదాటును అడ్డుకునేందుకు ఎమ్మెల్యే క్యాంపు నిర్వహించినప్పటికీ కౌన్సిలర్ల లాబీయింగ్ మాత్రం మారడం లేదని తెలుస్తోంది. రేపు మధ్యాహ్నం ఎవరికి చేతులెత్తి ఎవరు మద్దతు తెలుపుతారో గందరగోళంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఉత్కంఠ మధ్య సోమవారం జరిగే మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ఎలా ఉంటుందోనని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా వైస్ చైర్మన్ పదవి కోసం బీసీ సామాజిక వర్గంతోపాటు ఎస్సీ సామాజిక వర్గం వారు కూడా పోటీ పడుతున్నట్లు తెలుస్తుంది. చైర్మన్ పదవి ఓసికి కట్టబెడితే వైస్ చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వెంకటేష్ కు ఇవ్వాలన్నది అధినాయకుల మదిలో ఉన్నట్లు తెలుస్తుంది. వనపర్తి మున్సిపాలిటీలో అత్యధిక శాతం బీసీలు గెలుపొందినప్పటికీ ఉన్నత వర్గానికి ఎస్సీకి కేటాయిస్తే బీసీల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పీఠముడిని ఎమ్మెల్యే ఎలా విప్పుతారు.. చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ఎలా జరుగుతుందన్నది ఉత్కంఠకు సోమవారం మధ్యాహ్నం తెరపడనుంది.

# పైలెట్ రోహిత్ రెడ్డి ఇంటికి పోలీసులు

- **పైలెట్ రోహిత్ రెడ్డి ఇంటికి పోలీసులు**

**ముద్ర, బండ్లగూడ :**

మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిని అరెస్టు చేయడానికి పోలీసులు ప్రయత్నించారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గంలో పలుచోట్ల స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే గత శుక్రవారం ఫలితాల రోజు రోహిత్ రెడ్డి తన అనుచరులతో హంగామా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలియజేశారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శుక్రవారం కౌంటింగ్ కేంద్రం వద్ద ఉన్న మీడియా పాయింట్లో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో తనను కూడా లోపలికి వెళ్ళనివ్వాలని రోహిత్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. ఈ సందర్భంలో ఓ పోలీస్ అధికారిని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తోసేశారు. ఇన్స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తాండూరు పోలీసులు ఆదివారం సాయంత్రం మణికొండలోని రోహిత్ రెడ్డి ఇంటికి వచ్చారు. విషయం తెలిసిన బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అక్కడికి చేరుకొని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎట్టకేలకు పోలీసులు రోహిత్ రెడ్డి ఇంట్లోకి ప్రవేశించి ఆయన కోసం వెతికారు. రోహిత్ రెడ్డి ఇంట్లో లేకపోవడంతో వారు వెనుతిరిగారు. అధికారులు తిరిగి వెళ్లినా సిబ్బందిని ఆయన ఇంటి వద్ద ఉంచారు. రోహిత్ రెడ్డి ఏ క్షణంలో ఇంటికి వచ్చిన అరెస్టు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. పోలీసులు అతిగా ప్రవర్తించడమే కాకుండా వీడియోలు తీస్తున్న తమ సెల్ ఫోన్లను కూడా లాక్కున్నారని ఆయన కుటుంబ సభ్యులు, అక్కడికి చేరుకున్న నాయకులు ఆరోపిస్తున్నారు.







# మేయర్ పీఠం టెన్షన్.. టెన్షన్...!

- **సీల్డ్ కవర్ లో మేయర్ అభ్యర్థుల పేర్లు**
- **పలు చోట్ల కుదరని పొత్తులు**
- **హంగ్ లో కూడా కింగ్ కావాలని చూస్తున్న కాంగ్రెస్**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



నిన్నటి దాకా ఒక లెక్క.. నేడు ఒక లెక్క.. మేయర్ పీఠం పై వేసుకున్న లెక్కలన్నిటికీ నేటి తో తెరపడనుంది. ఆశావాహుల్లో మాత్రం టెన్షన్ వాతావరణం నెలకొంది. మేయర్ పదవి ఆశిస్తున్న అభ్యర్థులు పీఠం దక్కించుకునేందుకు ఎవరి ప్రయత్నంలో వారు నిమగ్నమయ్యారు. ఇప్పటికే గెలిచిన అభ్యర్థులు ఎమ్మెల్యే ల సమక్షంలో విహారయాత్రల్లో విహరిస్తున్నారు. అయినా మేయర్, చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో అని ఒక పక్క టెన్షన్ లో ఉన్నారు. మొదటి సారిగా మున్సిపల్ కార్పొరేషన్ అయిన మహబూబ్ నగర్ కు మొదటి మేయర్ ఎవరనే దానిపై కాంగ్రెస్ ప్రకటించలేదు. ఈ పదవి పై ఇప్పటికే ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. 49 డివిజన్ నుంచి గెలుపొందిన ప్రసన్న, 58 డివిజన్ నుంచి ఎన్నికైన రమాదేవి పేర్లు అధిష్టానం పరిశీలిస్తోంది. కానీ ఈ రెండు రోజుల నుంచి కొత్త పేరు తెర పైకి వచ్చింది. మైనార్టీ వర్గానికి ఇవ్వాలనే ఉదేశ్యం లో పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే పాలమూరులో బీసీ వర్గాలు ఉద్యమించే అవకాశం లేకపోలేదు. మైనారిటీలను బీసీల్లో కలిపింది ఇందుకేనా అని బీసీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇదే జరిగితే మహబూబ్ నగర్లో కాంగ్రెస్ దిక్కు లేకుంకుండా పోయే పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయం తెలిసిన బీసీ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఆదివారం ఆ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుని మేయర్ పదవి దక్కకుంటే ఏమిచెయ్యాలో అని చర్చించారు. ఏమి జరుగుతుందో నేడు బయటపడుతుంది. 60 డివిజన్లు ఉన్న ఈ కార్పొరేషన్ లో 31 డివిజన్ల లో విజయం సాధిస్తే మేయర్ పీఠం దక్కుతుంది. కానీ ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి 29 రావడంతో ముగ్గురు మైనార్టీలు, ఐదుగురు స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో మేయర్ పీఠం దక్కించుకొంటుంది. కానీ మేయర్ ఎవరనే దానిపై టెన్షన్ వీడడం లేదు. ఈ మేయర్ ఎవరినేది సీల్డ్ కవర్ దాచి ఉంచారు.

**గద్వాలలో వీడని సస్పెన్స్..**

జోగులాంబ గద్వాల జిల్లా మున్సిపాలిటీ లో ఇంకా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇక్కడి మున్సిపాలిటీ లో 37వార్డులకు గాను 19వార్డులు మేజిక్ ఫిగర్ గా ఉన్నాయి. కానీ ఏ పార్టీ కూడా మేజిక్ ఫిగర్ ను దాటలేదు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 16మంది గెలుపొందగా, బీఆర్ఎస్ నుంచి 11, బీజేపీ నుంచి 7, స్వతంత్రులు 3గెలుపొందారు. ఎవ్వరికీ సరైన మెజారిటీ రాక పోవడంతో స్వతంత్రుల పై ఆధారపడి వస్తోంది. ఇప్పటికే ఇక్కడి ఎమ్మెల్యే బీఆర్ఎస్ అని చెప్పుకుంటూ కాంగ్రెస్ గెలిచిన అభ్యర్థులతోపాటు ఇద్దరు స్వతంత్రులను కర్ణాటకలోని ఓ రిసార్ట్ కు తరలించారు. ఇద్దరు స్వతంత్రులను కలుపుకొన్న కాంగ్రెస్ మెజారిటీ 18స్థానాల్లో ఉంది. చైర్మన్ పీఠం దక్కాలంటే మరో అభ్యర్థి మద్దతు ప్రకటించాలి. ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో ఓటుతో 19స్థానాలు భర్తీ అయి చైర్మన్ పదవి కాంగ్రెస్ కు దక్కుతుంది. కానీ ఇక్కడే ఓ తిరకాసు ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటున్న బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కాంగ్రెస్ కి ఎక్స్ అఫిషియో ఓటు హక్కు వినియోగించుకుంటే చిక్కుల్లో పడతారు. ఈయనపై అనర్హత వేటు పడుతుందని ఇదివరకే తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ ఎదుట ప్రకటించారు. ఇప్పుడు కాంగ్రెస్ కి ఓటు వేస్తే ఆయన ఎమ్మెల్యే పదవిని కోల్పోయే అవకాశం ఉండడంతో ఆయన ఓటు వేయక పోవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈయన ఓటు వినియోగించుకోకుంటే కాంగ్రెస్ చైర్మన్ పీఠం దక్కలంటే ఇంకా ఒక అభ్యర్థి మద్దతు అవసరం. కానీ కాంగ్రెస్ కి చెందిన ఎంపీ మల్లు రవి తన ఎక్స్ అఫిషియో ఓటును గద్వాలలో ఉపయోగించుకుంటే చైర్మన్ పదవి కాంగ్రెస్ కు లైన్ క్లియర్ అవుతుంది. కానీ ఆయన ఓటు అలంపూర్ మున్సిపాలిటీ కి కూడా అత్యవసరం ఉంది. ఆయన ఎక్కడ ఉపయోగించుకుంటారో వేచిచూడాలి. నేడు చైర్మన్ ఎన్నిక ఎలా జరుగుతుందో అని అంతా టెన్షన్ లో ఉన్నారు.

**అలంపూర్లో ఉత్కంఠ..**

అలంపూర్ మున్సిపాలిటీ లో ఉత్కంఠ నెలకొంది. ఇక్కడి 10 కౌన్సిల్ స్థానాల్లో కాంగ్రెస్ కి 5, బీఆర్ఎస్ కు 5 చొప్పున గెలుచుకున్నాయి. సమానమైన స్థానాలు రావడంతో చైర్మన్ పదవి దక్కలంటే ఇంకా ఒక స్థానం దక్కాలి. ఇక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు ఉన్నారు. ఈయన ఎక్స్ అఫిషియో సభ్యుని ఓటు వినియోగించు కుంటే చైర్మన్ పదవి దక్కుతుంది. కానీ కాంగ్రెస్కి చెందిన ఎంపీ మల్లు రవి కూడా ఎక్స్ అఫిషియో సభ్యుని ఓటు వినియోగించుకుంటే మళ్ళీ సమానమైన ఓట్లు వస్తాయి. ఈ విషయం తేలకపోవడంతో చైర్మన్ పదవికి డ్రా పద్ధతిని అధికారులు ఉపయోగించే అవకాశం ఉంది. అధికార కాంగ్రెస్ మాత్రం హంగ్ ఉన్న మున్సిపాలిటీలలో కింగ్ కావాలని పావులు కదుపుతోంది.

**అమరచింతలో అదే సీన్..**

అమరచింత మున్సిపాలిటీలో మరింత గందరగోళం ఏర్పడింది. ఇక్కడ 10 వార్డులు ఉండగా ఇందులో కాంగ్రెస్ కు 3, బీఆర్ఎస్ కు 3, బీజేపీకి 3, ఒకటి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. చైర్మన్ పదవి దక్కలంటే 6మంది సభ్యుల బలం కావాలి. ఇది ఏ పార్టీకి లేదు. మక్తల్ ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరి ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో ఓటు వేసినా మేజిక్ ఫిగర్ దాటదు. ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీ కలిసి చైర్మన్ పదవి దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ కూడా కొందరు బీఆర్ఎస్ అభ్యర్థుల మద్దతు కూడగట్టె ప్రయత్నం జరుగుతోంది. చైర్మన్ పదవి దక్కడం కోసం మంత్రి ఎలా చక్రం తిప్పుతారో వేచిచూడాలి. మిగతా అన్ని మున్సిపాలిటీలలో చైర్మన్ అభ్యర్థి ని నేడు ప్రకటించే అవకాశం ఉంది.

# అన్నదాతలు, ఎగుమతి దారులకు రాహుల్ తప్పుదోవ

- **భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అసత్య ఆరోపణలు**
- **రైతులు, ఎగుమతి దారుల్లో భయాందోళనలు సృష్టించే కుట్ర**
- **నిరాశ, నిస్పృహలతో దిక్కుతోచని స్థితిలో ఈ వ్యాఖ్యలు**
- **కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



భారత్అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు రైతులు, ఎగుమతి దారుల్లో అనవసర భయాందోళనలు కలిగించేందుకు చేసిన కుటిల ప్రయత్నమేనని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. నెగిటివ్ రాజకీయాల ద్వారా దేశ పురోగతిని వెనక్కి లాగేందుకు రాహుల్ కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. వాస్తవాలకు విరుద్ధంగా అన్నదాతలు, ఎగుమతిదారులను తప్పుదోవ పట్టించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు అంగీకరించరన్నారు. ఇప్పటివరకు వరుసగా వంద ఎన్నికల్లో పరాజయాల తర్వాత రాహుల్ గాంధీ నిరాశ, నిస్పృహలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోడీపై తనకు ఉన్న వ్యతిరేకతను దేశంపై వ్యతిరేకతగా మలచుకున్నారని విమర్శించారు. 11 ఏళ్లుగా దేశం సాధిస్తున్న ప్రగతిని చూసి జీర్ణించుకోలేక, అధికారం దక్కదన్న అసహనంతో దేశంలో అన్నదాతలను, ఎగుమతిదారులను రెచ్చగొట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు వీటిని కూడా తిప్పికొడతారన్నారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఆదివారం ట్వీట్ చేశారు.

**రూ.45 లక్షల కోట్ల టెక్స్‌టైల్ మార్కెట్‌కు అవకాశాలు..**

ప్రస్తుతం భారత్ రూ.4 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను ఎగుమతి చేస్తోందని 38 అభివృద్ధి చెందిన దేశాల పరిధిలోని 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా రూ.45 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్‌కు అవకాశాలు ఏర్పడ్డాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏడు మెగా టెక్స్టైల్ పార్కులను అభివృద్ధి చేస్తోందన్న కేంద్రమంత్రి... ఇందులో ఒకటి తెలంగాణలోని వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో డెవలప్ అవుతోందన్నారు. అమెరికా, ఇతర దేశాలతో కుదురుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా ఎగుమతులు గణనీయంగా పెరిగి, వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుందని చెప్పారు. దీంతో తెలంగాణకు కూడా పెద్ద మొత్తంలో లబ్ధిచేకూరనుందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి చెందడం, ఇక్కడి యువతకు ఉద్యోగాలు రావడం రాహుల్ గాంధీకి ఇష్టం లేదా? అని ప్రశ్నిచారు.

**- పత్తి రైతులకు ఆందోళన అక్కర్లేదు..**

రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలతో వస్త్ర పరిశ్రమ ఎగుమతిదారులను, పత్తి డిమాండ్ తగ్గుతుందని రైతులను ఆందోళనకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. భారత వస్త్ర పరిశ్రమ రంగంలో విస్తారమైన వృద్ధి అవకాశాలు ఉన్నందున భారత పత్తికి డిమాండ్ నిరంతరం పెరుగుతుందని చెప్పారు. దీంతో రైతుల ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. భారతీయ పత్తి రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. 2004 నుండి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా అనేక అంశాల్లో రాజీపడిన సంగతి మనందరికీ తెలుసని 2013లో బాలీలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రివర్గ సమావేశంలో ధాన్యం, పత్తిపై కనీస మద్దతు ధర వ్యవస్థను 2017 నాటికి రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించిందన్నారు.



# ఎక్స్ అఫీషియో ఓటు వేసేందుకు 'పేట'కు ఎమ్మెల్యే

**ముద్ర, నారాయణపేట :**

కొన్ని నెలల నుంచి నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేదు. గతంలో ఓ మారు ఎమ్మెల్యే కాలుకి గాయమైంది. ఈ సమయంలో డాక్టర్లు నడవకుండా ఎమ్మెల్యేకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈమేరకు ఎమ్మెల్యే చాలా రోజులు నారాయణ పేట నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉన్నారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఎక్కడా కూడా ప్రచారానికి పూర్తి దూరంగా ఉన్నారు. కానీ నారాయణపేట మున్సిపల్ ఎన్నికలు అయిన తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి ఎక్స్ అఫీషియో ఓటు అనివార్యం కావడంతో ఆదివారం సివిఆర్ బంగ్లాకు ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి చేరుకుంది. అయితే చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునేందుకు గట్టి ప్రయత్నంలో భాగంగానే ఎమ్మెల్యే తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడికి వచ్చినట్లు తెలుస్తుంది.

# టార్గెట్ సీఎం రేవంత్..!

- **రేవంత్ ఒక్కడే మొనగాడా..?**
- **పదేండ్లు నేనే సీఎం అని చెప్పకోవడం తప్ప**
- **పార్టీ నేతలను, అధిష్టానాన్ని అవమానించాడు**
- **ఆయన గట్టోడయితే మహబూబ్ నగర్ ఎంపీ సీటు ఎందుకు చేజారింది..?**
- **సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి**

**ముద్ర, హైదరాబాద్ :**

సీఎం రేవంత్ రెడ్డిపై అధికార పార్టీకి చెందిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి విరుచుకుపడ్డారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సమయంలో తెలంగాణకు నేనే రాజు.. నేనే మంత్రినని.. మరో పదేండ్లు నేనే సీఎం అని రేవంత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణకు ఆయన్ను ఎవరు రాజు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ లో సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడే మొనగాడా..? అని నిలదీశారు. పదేళ్లు నేనే ముఖ్యమంత్రి ఉంటా అని చెప్పుకోవడం తప్పు కాదా..? అని ప్రశ్నించారు. ఆదివారం నల్గొండలో ఓ మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. సీఎంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ మీడియాతో చిట్ చాట్ చేసిన రేవంత్ రెడ్డి.. పదేళ్లు నేనే ముఖ్యమంత్రి ఉంటా అని చెప్పుకోవడం తప్పు కాదా ? అని ప్రశ్నించారు. సీఎం ఆ వ్యాఖ్యలు చేసి ఏండ్ల నుంచి కాంగ్రెస్ లో ఉన్న సీనియర్ నాయకులతో పాటు అధిష్టానాన్నీ అవమానించారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి నిజంగా మొనగాడు అయితే... పార్టీలో ఆయన గట్టోడయితే మహబూబ్ నగర్ ఎంపీ సీటు ఎందుకు చేజారిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బలమైన వ్యక్తి అయితే మల్కాజ్ గిరి ఎంపీ సిట్టింగ్ సీటులో ఎందుకు ఓడిపోయామో వివరణ ఇవ్వాలన్నారు. ఆయన అంత బలవంతుడే అయితే ఆదిలాబాద్,కరీంనగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎందుకు గెలవలేక పోయిందో జవాబు చెప్పాలన్నారు. రేవంత్ పీసీసీగా ఉన్న సమయంలో హుజురాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ లు ఎందుకు రాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన చెప్పుకుంటున్నట్లు రేవంత్ బలమైన నాయకుడు కాదన్న రాజగోపాల్ రెడ్డి.. పార్టీ అధికారంలోకి వచ్చింది అంటే అది కాంగ్రెస్ పార్టీ చెమట చుక్క ఫలితమే అన్నారు. రేవంత్ తన వైఖరి మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.



**టాప్ 10 భారత్-పాక్ మ్యాచ్ లు**

2007 T20 వరల్డ్ కప్ (డర్బన్ – టై మ్యాచ్) మ్యాచ్ టై కావడంతో బౌల్-అవుట్‌లో భారత్ గెలిచింది. ఇదే T20 క్రికెట్‌లో ఐకానిక్ మ్యాచ్‌గా నిలిచింది.




# పాకిస్తాన్ పై ఇషాన్ విధ్వంసం




- యువరాజ్ రికార్డు బ్రేక్
- టీమిండియా 175 /7 భారీ స్కోరు

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టి20 వరల్డ్ కప్ లో భాగంగా శ్రీలంక రాజధాని కొలంబోలో భారత జట్టుతో జరుగుతున్న మ్యాచ్ లో పాకిస్తాన్ జట్టు టాస్ గెలిచింది. బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ బౌలింగ్ కు సహకరిస్తున్న నేపథ్యంలో పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా బౌలింగ్ వైపు దృష్టి సారించాడు. సల్మాన్ బౌలింగ్ ఎంచుకోవడంతో పాటు.. ప్రారంభ ఓవర్ తనే వేశాడు. తొలి బంతిని ఇషాన్ కిషన్ డిఫెన్స్ ఆడాడు. రెండవ బంతికి సింగిల్ తీశాడు. స్ట్రైక్ అభిషేక్ శర్మ అందుకున్నాడు.

అభిషేక్ శర్మ ఇటీవల కాలంలో సూపర్ ఫామ్ లో ఉన్న నేపథ్యంలో.. పాకిస్తాన్ జట్టుపై భారీగా పరుగులు తీస్తాడని అందరూ అనుకున్నారు. కానీ, అభిషేక్ శర్మ మూడు బంతులను ఎదుర్కొన్నప్పటికీ ఒక్క పరుగు కూడా తీయలేకపోయాడు. మూడు బంతులు డాట్ గా మారిన నేపథ్యంలో అభిషేక్ శర్మ ఒక రకమైన ఒత్తిడికి గురయ్యాడు. ఆ తర్వాత బంతిని భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే అది కాస్త గాల్లో లేవడంతో క్యాచ్ అవుట్ అయ్యాడు. అభి షేక్ శర్మ అవుట్ కావడంతో పాకిస్తాన్ జట్టులో ఆనందం నెలకొంది. ఈ మ్యాచ్ కంటే ముందు అభిషేక్ శర్మ పై తాము ప్రత్యేక దృష్టిసారించామని పాకిస్తాన్ కెప్టెన్ వ్యాఖ్యానించాడు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో కూడా అతడు ఇదే విషయాన్ని పరోక్షంగా పేర్కొన్నాడు. అభిషేక్ శర్మ అవుట్ కావడంతో టీమ్ ఇండియా స్కోర్ బోర్డు పరుగులు పెట్టలేదని అందరూ అనుకున్నారు. పైగా తొలి ఓవర్ లో పాకిస్తాన్ జట్టు ఒక పరుగు మాత్రమే ఇచ్చింది. అందులోనూ ప్రమాదకరమైన అభిషేక్ శర్మ అవుట్ కావడంతో టీమిండియా పై ఒత్తిడి పెరుగుతుందని అందరూ అనుకున్నారు.

పాకిస్తాన్ జట్టు ఊహించింది ఒకటైతే.. జరిగింది మరొకటి. ఎందుకంటే అభిషేక్ అవుట్ అయినప్పటికీ.. మరో ఎండ్ లో ఇషాన్ కిషన్ నిలబడ్డాడు. పాకిస్తాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. 40 బంతులు ఎదుర్కొన్న ఇషాన్ కిషన్ 10 ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో 77 పరుగులు చేశాడు. ఈ వేగవంతమైన అర్ధశతకంతో భారత్-పాక్ టీ20 పోరుల్లో అత్యంత వేగంగా ఫిఫ్టీ సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానానికి చేరుకున్నాడు. 29 బంతుల్లో అర్ధశతకం సాధించిన రికార్డును ఇషాన్ అధిగమించడం విశేషం. పాకిస్తాన్ పై యువరాజ్ రికార్డును బ్రేక్ చేశాడు. అభిషేక్ శర్మ ను అవుట్ చేసిన ఆనందంలో ఉన్న పాకిస్తాన్ బౌలర్లు.. ఇషాన్ కిషన్ ను పట్టించుకోలేదు. కిషన్ తిలక్ వర్మతో కలిసి రెండో వికెట్ కు 46 బంతుల్లో 87 పరుగులు జోడించాడు. వాస్తవానికి ఇషాన్ కిషన్ ఈ స్థాయిలో ఆడతాడని పాకిస్తాన్ జట్టు ఊహించి ఉండదు. అందువల్లే ఒక పరుగుకు ఒక వికెట్ కోల్పోయిన టీమ్ ఇండియా.. ఆ తర్వాత రెండో వికెట్ కు బలమైన భాగస్వామ్యం నెలకొల్పింది. బౌలింగ్ పిచ్ మీద పాకిస్తాన్ జట్టుకు చుక్కలు చూపించింది.



ఇషాన్ ఔట్ అయ్యాక తిలక్ వర్మ 25, హార్దిక్ డకౌట్ కావడంతో టీమిండియా కష్టాల్లో పడింది. చివర్లో సూర్యకుమార్ యాదవ్ 32 పరుగులు, శివం దూబే 27 పరుగులతో చివర్లో రాణించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో పాకిస్తాన్ ముందు 175 /7 లక్ష్యాన్ని ఉంచింది.

## మోడల్‌తో ఇషాన్ కిషన్ పెళ్లి వార్తలు



ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

భారత యువ క్రికెటర్ ఇషాన్ కిషన్ వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. జైపూర్‌కు చెందిన మోడల్ అదితి హుండియాతో ఆయన వివాహం జరగనుందనే సమాచారం వెలువడింది. ఈ విషయాన్ని ఇషాన్ కుటుంబ సభ్యులు పరోక్షంగా వెల్లడించినట్లు తెలుస్తోంది.

గతంలో మిస్ ఇండియా పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన అదితి, ఇషాన్‌తో సన్నిహితంగా ఉన్నట్లు వార్తలు చెబుతున్నాయి. కుటుంబ సభ్యులు కూడా ఈ సంబంధానికి ఆమోదం తెలిపినట్టు సమాచారం.

పెళ్లి తేదీపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ ముగిసిన తర్వాత వివాహం జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మైదానంలో ఫామ్‌లో ఉన్న ఇషాన్ పేరు ఇప్పుడు వ్యక్తిగత కారణాలతోనూ వార్తల్లో నిలుస్తోంది.

## టీ–20 ప్రపంచకప్ నుంచి నిష్క్రమించిన నేపాల్

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

ఐసీసీ టీ-20 ప్రపంచకప్ 2026లో నేపాల్ జట్టు ప్రయాణం ముగిసింది. గ్రూప్ దశలో వరుసగా పరాజయాలు ఎదుర్కొన్న నేపాల్, సూపర్-8 అవకాశాలను కోల్పోయింది.

వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో కూడా ఆశించిన ఫలితం రాకపోవడంతో, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే టోర్నీ నుంచి బయటపడింది. కొంతమంది ఆటగాళ్లు పోరాడినా, సమష్టిగా జట్టు రాణించలేకపోవడం ప్రభావం చూపింది. ఈ పరాజయంతో నేపాల్ అభిమానులకు నిరాశ తప్పలేదు.



## అనుకున్నదే జరిగింది...

- కరచాలనం లేకుండానే ముగిసిన టాస్

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన హైటెన్షన్ మ్యాచ్‌లో అందరూ ఊహించినట్టుగానే టాస్ సమయంలో కెప్టెన్ల మధ్య కరచాలనం చోటు చేసుకోలేదు. కొలంబోలోని వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌కు ముందు నుంచే ఈ అంశంపై చర్చ సాగింది.

టాస్ గెలిచిన పాకిస్థాన్ సారథి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. టాస్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఆయన కరచాలనం చేయడానికి ముందుకు వచ్చినప్పటికీ, భారత కెప్టెన్ స్పందించకుండా పక్కకు జరిగిపోయాడు. ఇద్దరూ పరస్పరం మాట్లాడుకోకుండా తమ తమ స్థానాలకు వెళ్లిపోయారు. ఇప్పటికే ఇరు జట్ల మధ్య ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో, ఈ ఘటన మరోసారి చర్చకు దారి తీసింది. మ్యాచ్ ప్రారంభానికి ముందే వాతావరణం ఎంత ఉత్కంఠభరితంగా ఉందో ఈ సంఘటన స్పష్టంచేసింది.




## పాకిస్థాన్‌పై భారత్–ఏ జట్టు విజయం

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 పోటీలో భారత్-ఏ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. యూఏఈతో జరిగిన గత మ్యాచ్‌లో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకున్నట్టుగా, రాధా యాదవ్ నేతృత్వంలోని జట్టు పాకిస్థాన్-ఏను 8 వికెట్ల తేడాతో ఓడించింది. బ్యాంకాక్‌లో జరిగిన ఈ పోరులో భారత్ అన్ని విభాగాల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్-ఏ జట్టు 18.5 ఓవర్లలో 93 పరుగులకు కుప్పకూలింది. షవాల్ జుల్ఫికర్ 23, గుల్ రుక్ 21, అనోషా నాసిర్ 17 పరుగులతో కొంత ప్రతిఘటన చూపినప్పటికీ, మిగతా ఆటగాళ్లు నిలదొక్కుకోలేక పోయారు. భారత్ తరఫున సైమా ఠాకోర్, రాధా యాదవ్, ప్రేమ రావత్ తలో రెండేసి వికెట్లు పడగొట్టారు. జింతిమని కలితా, మిన్ను మణి చెరో వికెట్ సాధించారు.

94 పరుగుల లక్ష్యాన్ని భారత్-ఏ జట్టు కేవలం 10.1 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. దినేష్ వ్రింద అజేయ అర్ధశతకంతో జట్టును గెలుపు దిశగా నడిపింది. అనుష్క శర్మ, తేజల్ హసబిన్స్ తగిన మద్దతు అందించారు.

ఈ విజయంతో గ్రూప్-ఏలో భారత్-ఏ రెండో స్థానంలో నిలిచింది. సెమీఫైనల్ అవకాశాలు నిలబెట్టుకోవాలంటే నేపాల్‌తో జరగనున్న తదుపరి మ్యాచ్‌లో మెరుగైన పరుగుల సగటుతో గెలవాల్సి ఉంది. యూఏఈ ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతుండగా, పాకిస్థాన్ కూడా పోటీలోనే ఉంది. ఇదిలా ఉంటే, త్వరలో జరిగే ప్రపంచకప్ పోరుకు ముందు ఈ విజయం భారత్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది. అదే జోరు ప్రధాన టోర్నీలోనూ కొనసాగాలని వారు ఆశిస్తున్నారు.




## సిడ్నీలో సంచలనం.. అరుంధతి విశ్వరూపం

- భారత్‌కు విజయశుభారంభం

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

ప్రపంచకప్ విజేతగా తొలి విదేశీ పర్యటనకు బయలుదేరిన భారత మహిళల జట్టు ఆరంభ మ్యాచ్‌లోనే ఆధిపత్యం చాటింది. సిడ్నీలో జరిగిన మొదటి టీ20లో ఆస్ట్రేలియాను 21 పరుగుల తేడాతో ఓడించి సిరీస్‌లో ముందంజ వేసింది.

ముందుగా బౌలింగ్ చేసిన భారత్ తరఫున అద్భుత ప్రదర్శనతో కంగారూలను కట్టడి చేసింది. 4 వికెట్లు తీసి ఆస్ట్రేలియా బ్యాటింగ్‌ను కుదేలు చేసింది. రేణుకా సింగ్, శ్రీ చరణి కూడా కీలక సమయంలో వికెట్లు సాధించడంతో ఆతిథ్య జట్టు 133 పరుగులకే ఆలౌటైంది.

చిన్న లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు దూకుడైన ఆరంభం ఇచ్చింది. వర్షం అంతరాయం కలిగించినప్పటికీ, అప్పటికి భారత్ అవసరమైన పరుగుల కంటే ముందంజలో ఉండటంతో డక్‌వర్త్-లూయిస్ విధానం ప్రకారం విజేతగా ప్రకటించారు. ఈ గెలుపుతో నేతృత్వంలోని భారత జట్టు మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. విదేశీ పర్యటనకు ఇదే సరైన ఆరంభమని అభిమానులు అభినందిస్తున్నారు.




## అభిషేక్ మీద కాన్సన్ట్రేషన్ చేసి మునిగిన పాక్

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా కొలంబోలో జరిగిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో పాకిస్థాన్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. కెప్టెన్ సల్మాన్ అలీ అఘా స్వయంగా తొలి ఓవర్ వేస్తూ అభిషేక్ శర్మపై ప్రత్యేక దృష్టి పెట్టాడు.

సూపర్ ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మను డకౌట్ చేయడంతో పాక్ శిబిరంలో ఉత్సాహం కనిపించింది. భారత్ కష్టాల్లో పడిందని అందరూ భావించారు. అయితే అదే సమయంలో మరో ఎండ్‌లో నిలిచిన ఇషాన్ కిషన్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు.




దూకుడుగా ఆడిన ఇషాన్ 77 పరుగులతో పాక్ బౌలర్లను ఇబ్బంది పెట్టాడు. తిలక్ వర్మతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును గట్టెక్కించాడు. అభిషేక్ వికెట్‌తో సంతోషించిన పాక్, ఇషాన్ దాడిని అంచనా వేయలేక పెద్ద మూల్యం చెల్లించింది.






## భారత్-పాకిస్థాన్ మ్యాచ్ లో దురంధర్ దుమారం

- హనుమన్‌కైండ్ ప్రదర్శనపై విమర్శలు

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

భారత్-పాకిస్థాన్ మధ్య జరుగుతున్న కీలక మ్యాచ్‌కు కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియం వేదికైంది. మ్యాచ్ ఆరంభానికి ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో భారత గాయకుడు హనుమన్‌కైండ్ తన గీతంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు.

అయితే ఈ నిర్ణయంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తటస్థ వేదికలో జరుగుతున్న మ్యాచ్‌కు భారతీయ కళాకారుడిని ఎంపిక చేయడం సరైందా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కేరళకు చెందిన హనుమన్‌కైండ్ గత ఏడాది విడుదలైన ఒక గీతంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు.



ఇరు దేశాల అంగీకారంతో తటస్థ దేశంలో మ్యాచ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రారంభ కార్యక్రమంలో భారతీయ గాయకుడికి అవకాశం ఇవ్వడం పక్షపాతంగా ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఈ మ్యాచ్‌కు ఉన్న విస్తృత ఆదరణ దృష్ట్యా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని నిర్వాహకుల నిర్ణయాన్ని సమర్థించే వర్గాలూ ఉన్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
16.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





జడలో గులాబీలతో ఆకట్టుకుంటున్న
## అనుపమ..

'అఆ'తో తెలుగు తెరకు పరిచయమై తన నటనతో గుర్తింపు పొందింది. చిన్న, మధ్యస్థాయి చిత్రాల్లో వరుస అవకాశాలు అందుకున్న ఆమె, 'రౌడీ బాయ్స్', 'టిల్లు స్క్వేర్' వంటి సినిమాల్లో గ్లామర్ పాత్రలతో యువతను ఆకట్టుకుంది. తాజాగా చంకీలు అలంకరించిన డ్రెస్‌లో, కొప్పు జడలో గులాబీలు పెట్టుకుని ఇచ్చిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ లుక్‌లో ఆమె అందం అభిమానులను ఆకర్షిస్తోంది.

రెడ్ ఔట్‌ఫిట్‌లో రోజ్జీ
## గ్లామర్ షో



రోజ్జీ వాలియా ఎర్రటి ఔట్‌ఫిట్‌లో గ్లామర్‌తో మెరిసిపోయింది. క్రాప్ టాప్, ఫ్లోయింగ్ స్కర్ట్ కాంబినేషన్‌లో స్టైలిష్‌గా కనిపించిన ఆమె, కాన్ఫిడెంట్ పోజులతో ఆకట్టుకుంది. సూర్యకాంతి వెలుగుల్లో ఇచ్చిన స్టిల్స్ ఆమె లుక్‌కు మరింత హైలైట్ ఇచ్చాయి. లాంగ్ వేవీ హెయిర్, సాఫ్ట్ మేకప్‌తో రోజ్జీ అందం మరింత మెరుస్తూ కనిపిస్తోంది. సింపుల్ స్టైలింగ్‌లోనూ గ్లామర్ ఎలివేట్ చేయగలగడం ఆమె ప్రత్యేకతగా చెప్పొచ్చు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ అభిమానుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి.



## పెద్ది'లో కుషిత కల్లపు..?

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్న కుషిత కల్లపు ఇప్పుడు సినిమాల్లో తన స్థానం బలపర్చుకునే దిశగా ముందుకెళ్తోంది. రీల్స్, ఫొటో షూట్స్‌తో యూత్‌లో క్రేజ్ సంపాదించిన ఆమె, వెబ్ సిరీస్‌లు సినిమాల్లో అవకాశాలు అందుకుంటోంది. గతంలో రాజ్ తరుణ్‌తో కలిసి 'చిరంజీవ' చిత్రంలో నటించి నటిగా గుర్తింపు పొందింది.తాజాగా ఆమె పేరు ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌తో అనుసంధానమవుతోంది. గ్లోబల్ స్టార్ హీరోగా, దర్శకుడు తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను కుషిత తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో రీషేర్ చేసింది. సాధారణంగా నటీనటులు తాము భాగమైన ప్రాజెక్టుల అప్‌డేట్స్‌ను మాత్రమే పంచుకుంటారు. దీంతో ఈ చిత్రంలో ఆమెకూ పాత్ర ఉందన్న ఊహాగానాలు ఫిల్మ్ నగర్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ పోస్టుకు అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో 'పెద్ది'పై ఇప్పటికే అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రామ్ చరణ్ మాస్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. హీరోయిన్‌గా నటిస్తుండగా, కీలక పాత్రల్లో , , కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో కుషితకు అవకాశం దక్కితే, అది ఆమె కెరీర్‌కు కీలక మలుపుగా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

'స్వయంభు' టీజర్
## రీఅప్‌లోడ్..
**ఏఐపై నిఖిల్ వ్యాఖ్యలతో చర్చ**

యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ సోషల్ మీడియా వేదికగా చేసిన తాజా పోస్టు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆయన హీరోగా తెరకెక్కుతున్న 'స్వయంభు' చిత్ర టీజర్‌ను సాంకేతిక కారణాల వల్ల మళ్లీ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. మెరుగైన క్వాలిటీతో టీజర్‌ను తిరిగి విడుదల చేశామని, ప్రేక్షకులు వీక్షించాలని కోరారు. అయితే అదే పోస్టులో నిఖిల్ చేసిన ఒక వ్యాఖ్య దృష్టిని ఆకర్షించింది. ఇటీవల విడుదలైన ఓ సినిమాలోలాగా తమ చిత్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం సినిమా రంగంలో ఏఐ వినియోగం పెరుగుతున్న తరుణంలో ఆయన వ్యాఖ్యలపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో కూడా భారీ స్థాయి సినిమాలకు ఏఐ సరిపోదని నిఖిల్ అభిప్రాయపడ్డారు. పీరియాడికల్ యాక్షన్ నేపథ్యంతో రూపొందుతున్న 'స్వయంభు'లో ఓ పల్లెటూరి యువకుడు యోధుడిగా ఎలా మారాడన్న కథాంశం ప్రధానంగా ఉండనుంది. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌లుగా నభా నటేశ్, సంయుక్త నటిస్తున్నారు.






## 'కపుల్ ఫ్రెండ్లీ'తో మెప్పించిన మానస వారణాసి

ఫీల్ గుడ్ ప్రేమకథల్లో హీరో-హీరోయిన్ల నటన కీలకం. ఈ విషయంలో 'కపుల్ ఫ్రెండ్లీ'లో సంతోష్ శోభన్తో పాటు మానస వారణాసి చూపించిన అభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా మానస నటన సినిమాకు ప్రధాన బలం అయ్యిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన మానస ఇంజనీరింగ్ పూర్తి చేసి 2020లో ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ కిరీటం సాధించింది. భరతనాట్యం నర్తకి అయిన ఆమె సామాజిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటుంది. గతంలో 'దేవకీనందన వాసుదేవ'తో తెరంగేట్రం చేసినప్పటికీ పెద్ద గుర్తింపు రాలేదు. ఇప్పుడు 'కపుల్ ఫ్రెండ్లీ'లో భావోద్వేగభరిత పాత్రను సహజంగా పోషించి ప్రశంసలు అందుకుంటోంది. సరైన కథలను ఎంచుకుంటే పరిశ్రమలో మరింత ముందుకు వెళ్లే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## ## దైవత్వం.. విధ్వంసం బ్యాక్‌డ్రాప్‌లో 'నాగబంధం'

- **టీజర్ విడుదల చేసిన సూపర్ స్టార్ మహేష్ బాబు**

టాలీవుడ్‌లో మైథాలజీ, ఫాంటసీ కథాంశాల జోరు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రూపొందుతున్న 'నాగబంధం' టీజర్ మహా శివరాత్రి సందర్భంగా విడుదలైంది. సూపర్ స్టార్ సోషల్ మీడియా ద్వారా టీజర్‌ను ఆవిష్కరించారు. దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేశ్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మాటలు లేకుండా కేవలం విజువల్స్, నేపథ్య సంగీతంతో రూపొందించిన టీజర్‌లో దైవత్వం -విధ్వంసం మధ్య సంఘర్షణను సూచించారు. భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.





## వేదికపై బాలయ్యకు యాంకర్ ప్రపోజ్...

హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు పాల్గొన్న ఓ కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించిన యాంకర్ ఆయనకు గులాబీ పువ్వు అందించి శుభాకాంక్షలు తెలిపింది. గులాబీని స్వీకరించిన బాలకృష్ణ దాన్ని తన స్టైల్లో గాల్లోకి విసిరి మళ్లీ పట్టుకుని ప్రేక్షకులను అలరించారు. అనంతరం ఆ పువ్వును సూట్ జేబులో పెట్టుకుని తన ప్రసంగాన్ని కొనసాగించారు. అన్విత గ్రూపు నిర్వహించిన ఈ ఈవెంట్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతూ వైరల్‌గా మారాయి.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com